ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3 వరంగల్
శనివారం 17 ఫిబ్రవరి 2024

శివసత్తుల పూనకం.. నిలువెత్తు బంగారం..

- మేడారం వనదేవతలకు భక్తుల ముందస్తు మొక్కులు
- జాతర సమీపిస్తుండటంతో పెరుగుతున్న రద్దీ





సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద భక్తుల కోలాహలం, జంపన్న వాగులో పుణ్యస్నానం

మేడారం, ఫిబ్రవరి 16 : మేడారం మహాజాతర ఘట్టానికి సమయం సమీపిస్తోంది. ఇప్పటికే నెలరోజులుగా భక్తులు ముందస్తు దర్శనాలు చేసుకుని మొక్కులు చెల్లించుకుంటుడగా.. శివసత్తుల పూనకాలు, నిలువెత్తు బంగారంతో వస్తున్న భక్తులతో మేడారం పరిసరాలు సందడిగా మారుతున్నాయి. రోజురోజుకు భక్తుల రద్దీ పెరుగుతుండగా శుక్రవారం లక్షలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని అధికారులు చెబుతున్నారు. శివసత్తుల పూనకాలు, భాజాభజంత్రీలు, డోలు సన్నాయి మేళాలు, సమ్మక్క సారలమ్మలకు జేజేలతో పరిసరాలన్నీ హోరెత్తుతున్నాయి. వనదేవతల మొక్కుల్లో భాగంగా భక్తులు జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి కాలినడకన గద్దెలకు చేరుకుని.. పసుపు, కుంకుమ, చీర సారె సమర్పించి.. యాటమొక్కులు చెల్లించుకుంటున్నారు. నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పిస్తున్నారు. లక్షలాదిగా వస్తున్న భక్తులతో గద్దెల ప్రాంగణం, జంపన్నవాగు తీరం కిటకిటలాడుతుండగా.. భక్తుల తాత్కాలిక గుడారాలు, చిరువ్యాపారుల అంగళ్లతో మేడారమంతా జాతర సందడి కనిపిస్తోంది.

వనదేవతలను దర్శించుకున్న కేంద్ర మాజీ మంత్రి

మేడారం వనదేవతలు సమ్మక్క సారలమ్మలను కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్ కుటుంబ సమేతంగా తల్లులను దర్శించుకున్నారు. పూజారులు సాదరంగా ఆహ్వానించి ప్రత్యేక పూజలు చేశారు. పూలు పండ్లు, కొబ్బరికాయ, బెల్లం తల్లులకు సమర్పించారు. పూజారులు కండువాతో సన్మానించారు.



5

మహాజాతరకు ఆర్టీసీ రెడీ

- రేపటి నుంచి ప్రత్యేక సర్వీసులు
- 6వేల బస్సుల్లో 35లక్షల మంది భక్తుల తరలింపే లక్ష్యం
- మేడారంలో 55 ఎకరాల్లో తాత్కాలిక బస్టాండ్ ఏర్పాటు

నేడు మేడారానికి నలుగురు మంత్రులు రాక

- ఏర్పాట్లను పరిశీలించిన ములుగు కలెక్టర్



మేడారం, ఫిబ్రవరి 16 : మేడారం జాతరకు శనివారం నలుగురు మంత్రులు రానున్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లను శుక్రవారం ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించారు. శనివారం మేడారంలో రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క పర్యటించనున్నారు. ఈ సందర్భంగా అమ్మవార్ల గద్దెల ప్రాంగణం, మీడియా పాయింట్, హరిత హోటల్, ఆర్టీసీ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, డీపీవో వెంకయ్య, తహసీల్దార్ రవీందర్ తదితరులు ఉన్నారు.

ముగిసిన ఈవీఎంల మొదటి దశ తనిఖీ

- పరిశీలించిన కలెక్టర్ ప్రావీణ్య, అధికారులు



ఈవీఎంల మాక్ పోలింగ్ తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 16: రానున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 5 నుంచి ప్రారంభమైన ఈవీఎంల మొదటి దశ తనిఖీ ప్రక్రియ శుక్రవారం ముగిసింది. కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర సంఘం ఆదేశాల మేరకు వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లోని ఈవీఎంల గోదాంలలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈసీఐఎల్ ఇంజనీర్ల ఆధ్వర్యంలో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ విధానాన్ని కలెక్టర్ ప్రావీణ్య పరిశీలించారు. 500 ఓట్లకు గాను 20 ఈవీఎంలు, 1200 ఓట్లకు 12 ఈవీఎంలను మొత్తంగా మాక్ పోలింగ్‌లో 52 ఈవీఎంలను వినియోగించారు. వీవీ ప్యాడ్‌ల స్లిప్‌ల లెక్కింపు సమానంగా ఉన్నాయని అధికారులు నిర్ధారించారు. అనంతరం పోలీసు భద్రత మధ్య ఈవీఎంలను స్ట్రాంగ్‌రూంకు తరలించి కలెక్టర్, ఆర్డీవో సమక్షంలో అధికారులు సీల్ వేశారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు సంబంధించి 1,848 బ్యాలెట్ యూనిట్లు, 1,019 కంట్రోల్ యూనిట్లు 1,212 వీవీ ప్యాడ్‌లను సిద్ధం చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో వాసుచంద్ర, ఎన్నికల పర్యవేక్షకులు రమేష్, నాయబ్ తహసీల్దార్లు రంజిత్, అనీఫ్, రాజకీయ పార్టీల నాయకులు ఈవీ శ్రీనివాసరావు, దాసరి రాజేష్, శ్రీకాంత్, లక్ష్మణ్, యాదగిరి, అనిల్‌కుమార్, పాయెల్స్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో బంద్ ప్రశాంతం

- కార్మిక సమ్మెకు మద్దతుగా పలు సంఘాల ర్యాలీలు



వరంగల్ రైల్వే స్టేషన్ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న ఆల్ ట్రేడ్ యూనియన్ నేతలు

వరంగల్‌టౌన్, ఫిబ్రవరి 16 : రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం తలపెట్టిన బంద్ జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. వరంగల్ నగరంలో ఉదయం ఆటోలను నడవనీయకుండా ఆటో సంఘాల నాయకులు అడ్డుకున్నారు. కొన్ని చోట్ల దుకాణాలు తెరుచుకోలేదు. కార్మిక సంఘాల విజ్ఞప్తి మేరకు జిల్లాలో వ్యవసాయ మార్కెట్లకు సెలవు ప్రకటించారు. ఆల్ ట్రేడ్ యూనియన్స్, కిసాన్ మోర్చా సంయుక్త ఆధ్వర్యంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గన్నారపు రమేష్, ఐఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శి పుల్ల రమేష్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంగుల దయాకర్, కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ రాచర్ల బాలరాజు అధ్యక్షతన వరంగల్ రైల్వే స్టేషన్ నుంచి పోచమ్మమైదాన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. సంగెం మండల కేంద్రంలో సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఎండీ.ఇస్మాయిల్ ఆధ్వర్యంలో భార్రీ ర్యాలీ నిర్వహించారు. పల్లారుగూడలో తెలంగాణ రైతు సంఘం సోమిడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. నల్లబెల్లి మండల కేంద్రంలో కార్మిక సమ్మెను పురస్కరించుకుని మధ్యాహ్నం వరకు దుకాణాలు మూసి వేసి, బ్యాంకులు బంద్ చేశారు. ఆల్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్ నుంచి ఆంధ్రా బ్యాంకు సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

దుగ్గొండి మండలం గిర్నిబావి వద్ద ఏఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కార్మిక సమ్మెకు మద్దతుగా ర్యాలీ నిర్వహించారు. నెక్కొండ మండల కేంద్రంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు ఆధ్వర్యంలో కార్మిక సమ్మెకు మద్దతుగా పాఠశాలలు, బ్యాంకులు, వ్యవసాయ మార్కెట్‌ను బంద్ చేశారు. అంబేడ్కర్ సెంటర్ నుంచి వ్యవసాయ మార్కెట్ వరకు ర్యాలీ నిర్వహించారు. వర్ధన్నపేట పట్టణంలో ఆల్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో కార్మిక సమ్మెకు మద్దతుగా దుకాణాలు కొద్దిసేపు బంద్ చేశారు. ర్యాలీ నిర్వహించిన అనంతరం తహసీల్దార్‌కు ఆల్‌ట్రేడ్ యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. గీసుగొండ మండల కేంద్రంలో కార్మిక సమ్మెకు మద్దతుగా వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. బ్యాంకులు వ్యాపార సంస్థలు పాక్షికంగా బంద్ చేసి సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఖానాపూర్ మండల కేంద్రంలో ఏఐఎఫ్‌టీయూ, సీపీఎం ఆధ్వర్యంలో కార్మిక సమ్మెకు మద్దతుగా పాక్షికంగా దుకాణాలు బంద్ చేసి సంఘీభావం తెలిపారు. నర్సంపేట పట్టణంలో ఆల్‌ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో పాక్షిక బంద్ కొనసాగింది. అలాగే ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ నుంచి అంబేడ్కర్ సెంటర్, జయలక్ష్మి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు.

జిల్లా అదనపు కలెక్టర్‌గా సంధ్యారాణి

- డీఆర్‌వోగా శ్రీనివాస్

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 16 : రాష్ట్ర వ్యాప్తంగా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ గతంలో ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం దాన్ని పాక్షికంగా మార్పులు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీనిలో భాగంగా వరంగల్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా గట్టు సంధ్యారాణి, వరంగల్ రెవెన్యూ డీఆర్‌వోగా శ్రీనివాస్‌ను నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

పది ఫలితాల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి



6

సదస్సులో మాట్లాడుతున్న డీఈవో వాసంతి

బల్దియా బడ్జెట్‌కు కసరత్తు

- సన్నాహాల్లో అధికారగణం
- సమగ్రంగా రూపొందించాలని మేయర్ ఆదేశాలు
- మేడారం జాతర తరువాత సమావేశం ఉండే అవకాశం

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 16 : వరంగల్ మహానగర పాలక సంస్థ 2024-25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ రూపకల్పన జరుగుతోంది. ఈ మేరకు అధికారగణం సన్నాహాలు చేస్తోంది. జీడబ్ల్యూఎంసీ అన్ని విభాగాల నుంచి బడ్జెట్ రూపకల్పన సమాచార సేకరణలో అధికారులు నిమగ్నమయ్యారు.

గత బడ్జెట్ రూ.612.29 కోట్లు

వరంగల్ మహానగర పాలక సంస్థ 2023-24 వార్షిక బడ్జెట్ రూ.612.29 కోట్లు. ఇందులో రూ.394.16 కోట్లు గ్రాంట్ల రూపంలోనే ఉన్నాయి. సొంత ఆదాయం రూ.213.63 కోట్లు కాగా రూ.22.98 కోట్లు మాత్రమే మిగులు బడ్జెట్. నిధుల లేమి సమస్య క్రమంలో ఈ వార్షిక సంవత్సరం బడ్జెట్ రూపకల్పన ఎలా ఉంటుందనేది చర్చనీయాంశంగా మారింది. గతంలో కంటే నిధుల కేటాయింపు, నిధుల వ్యయం, అవసరత ఏ మేరకు ఉంటుందనే దానిపై అంచనాలు నెలకొన్నాయి.



బడ్జెట్ రూపకల్పనపై అధికారులతో సమావేశమైన మేయర్ సుధారాణి

అధికారులతో మేయర్ సమావేశం

బడ్జెట్ రూపకల్పన చర్యల్లో భాగంగా శుక్రవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో మేయర్ గుండు సుధారాణి అధికారులతో సమావేశమయ్యారు. అధికారుల నుంచి వివరాలు సేకరించారు. బడ్జెట్ రూపకల్పన అంశాలను చర్చించారు. బడ్జెట్‌ను సమగ్రంగా రూపొందించాలని అధికారులకు మేయర్ దిశానిర్దేశం చేశారు. మేడారం జాతర తరువాత బడ్జెట్ సమావేశం జరిగే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది.

మనస్ఫూర్తిగా సేవలందించాలి

- హెల్త్ డైరెక్టర్ రవీందర్‌నాయక్



మాట్లాడుతున్న హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీందర్‌నాయక్

హనుమకొండ అర్బన్/వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 16 : మనస్ఫూర్తిగా పని చేస్తూ సేవలు అందించాలని హెల్త్ డైరెక్టర్ రవీందర్‌నాయక్ అన్నారు. శుక్రవారం వరంగల్‌లోని ఐఎంఏ హాల్‌లో వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రోగ్రాం అధికారులు, కార్యాలయ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవీందర్‌నాయక్ మాట్లాడుతూ.. ప్రాథమిక వైద్యం, వ్యాధి నియంత్రణ, నివారణ లక్ష్యంగా నీతి అయోగ్ ఇండికేటర్ దృష్టిలో పెట్టుకొని ప్రతీ ఒక్కరు పని చేయాలన్నారు. ప్రజలకు సేవ చేయడమే గొప్ప ధర్మమని, నిబద్ధతతో పనిచేస్తూ సేవలు అందించాలన్నారు. కొవిడ్ సమయంలో వైద్య ఆరోగ్య శాఖ అందించిన సేవలు అమూల్యమని, దానితోనే మనకు మంచి పేరుతోపాటు గుర్తింపు రావడం జరిగిందన్నారు. మాతా, శిశు సంరక్షణ సేవలలో ప్రధానంగా సిజేరియన్ ప్రసవాలను తగ్గించి సాధారణ ప్రసవాలను పెంచాలన్నారు. అనంతరం హనుమకొండ, వరంగల్ జిల్లాల వైద్యాధికారులు, ప్రోగ్రాం అధికారులు జిల్లాకు మొదటి సారిగా విచ్చేసిన డాక్టర్ బి.రవీందర్‌నాయక్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల వైద్య ఆరోగ్య శాఖ అధికారులు డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ వెంకటరమణ, అడిషనల్ డీఎంహెచ్‌వో మదన్‌మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ ఎండీ.యాకూబ్‌పాషా, డాక్టరు సుధార్‌సింగ్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ ఉమాశ్రీ, డాక్టర్ హిమబిందు, నర్సింహారెడ్డి స్టాటిస్టికల్ ఆఫీసర్ ప్రసన్నకుమార్, కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే మాధవరెడ్డి



నర్సంపేట, ఫిబ్రవరి 16: నర్సంపేట ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్య పరిష్కారానికి నిధులు అందించాలని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీలో శుక్రవారం తాగునీరు, పోడు భూముల సమస్యలపై ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడారు. మహబూబాబాద్ ప్రాంతం నుంచి మిషన్ భగీరథ పైపులు ఏర్పాటు చేయడం వల్ల తరచూ పైపులు పగిలి నీటి సరఫరా నిలిచిపోతుందని అన్నారు. ఇటీవల నియోజకవర్గంలోని ఖానాపురంలో మిషన్ భగీరథ పైపులు పగిలిపోవడం వల్ల నీటి సరఫరా నిలిచిపోయి 15 రోజుల పాటు నియోజకవర్గ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని వివరించారు. వచ్చే వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా డీ ఫ్లోరైడ్ ప్రాజెక్టుకు మరమ్మతులు చేపడితే నర్సంపేట పట్టణంలోని 60వేల మందికి రోజు కుళాయిల ద్వారా తాగునీటిని సరఫరా చేసే అవకాశం ఏర్పడుతుందన్నారు. ఇటీవల గ్రిడ్, ఇంట్రావెల్ అధికారులతో మాట్లాడితే నిధుల కొరత ఉందని తనకు చెప్పారని ఎమ్మెల్యే సభ దృష్టికి తీసుకెళ్లారు. రూ.6 కోట్లు మంజూరు చేసి పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలోని డీ ఫ్లోరైడ్ ప్రాజెక్టుకు మరమ్మతులు చేస్తే ప్రజలకు రోజు కుళాయిల ద్వారా తాగునీటిని సరఫరా చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాగే పోడు భూముల సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు. దీంతో స్పందించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడుతూ నర్సంపేటలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.10 కోట్లు అయినా మంజూరి చేయించడంతో పాటు పోడు భూముల సమస్య పరిష్కారానికి సహకరిస్తామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే మాధవరెడ్డి తెలిపారు.

రిజిస్ట్రేషన్ కార్యాలయంపై ఏసీబీ నజర్

- రెండు రోజుల క్రితం ఒకరిపై దృష్టి
- త్రుటిలో తప్పించుకున్న ఉద్యోగి
- విషయం తెలుసుకుని డిప్యూటేషన్‌పై బదిలీ
- మరో ఉద్యోగిపై చర్యలకు రంగం సిద్ధం

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 16 : హనుమకొండ జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయంపై ఏసీబీ అధికారులు నజర్ వేశారు. కార్యాలయంలో అక్రమాలు చోటుచేసుకుంటున్నట్లు సమాచారం అందుకున్న ఏసీబీ అధికారులు బాధితుల ఫిర్యాదుతో రంగంలోకి దిగినట్లు సమాచారం. స్టాంప్స్ విక్రయ సెక్షన్ ఉద్యోగి ఒక స్టాంప్ వెండర్‌ను డబ్బులు డిమాండ్ చేసినట్లు తెలిసింది. స్టాంప్స్ కొనుగోలు చేసిన ప్రతీ సారి సెక్షన్ ఉద్యోగి డబ్బులు డిమాండ్ చేసేవాడని సమాచారం. దీనితో విసిగిపోయిన స్టాంప్ వెండర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించినట్లు తెలిసింది. రెండు రోజుల క్రితం బాధితుడితో వచ్చిన ఏసీబీ అధికారులు ఉద్యోగిని నేరుగా పట్టుకునే స్కెచ్ వేసినట్లు సమాచారం. ఈ సమాచారం కార్యాలయంలో ఒక ఉన్నతాధికారి చెవిన పడడంతో ఏసీబీ అధికారులకు వస్తున్నట్లు సదరు ఉద్యోగికి చెప్పాడు. దీంతో సదరు ఉద్యోగి అప్రమత్తం కావడంతో అధికారులు వెనుదిరిగారు. సెక్షన్ ఉద్యోగి నిర్వాకం బట్టబయలు కావడంతో శాఖ ఉన్నతాధికారులు అతడిని హెచ్చరించి పాలకుర్తి నియోజకవర్గ పరిధిలోని ఒక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి డిప్యూటేషన్‌పై పంపినట్లు సమాచారం. కాగా, ఇదే సెక్షన్ ఉద్యోగి గతంలో స్టాంప్స్ విక్రయాల విషయంలో వెండర్స్ నుంచి డబ్బులు తీసుకున్నట్లు ఆరోపణలు రావడంతో విచారణ చేసిన అధికారులు అతడిపై సస్పెన్షన్ వేటు వేసిన విషయం తెలిసిందే. అతడి స్థానంలో వచ్చిన మరో ఉద్యోగి సైతం తప్పుడు మార్గంలో పయనించి స్థాన చలనం కావడం గమనార్హం.

మరొకరిపై చర్యలకు అవకాశం

కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న మరో ఉద్యోగిపై అధికారులు చర్యలు తీసుకునే అవకాశాలున్నట్లు తెలిసింది. గతంలో తప్పుడు రిజిస్ట్రేషన్‌లు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొన్న సదరు ఉద్యోగిపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. విచారణ చేసిన అధికారులు ఉద్యోగికి క్లీన్ చిట్ ఇచ్చినట్లు సమాచారం. విచారణ సమగ్రంగా చేయలేదని గుర్తించిన ఉన్నతాధికారులు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. ఒకటి,రెండు రోజుల్లో ఉద్యోగిపై వేటు పడే అవకాశం ఉన్నట్లు సమాచారం.

స్టేట్ ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్‌గా సిరిసిల్ల రాజయ్య



హనుమకొండ సిటీ, ఫిబ్రవరి 16 : తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్‌గా మాజీ ఎంపీ, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సిరిసిల్ల రాజయ్య నియమితులయ్యారు. ఛైర్మన్‌తో పాటు ముగ్గురు సభ్యులతో కూడిన కమిషన్‌ను గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ శుక్రవారం అధికారికంగా ప్రకటించారు.

స్టేట్ ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్‌గా సిరిసిల్ల రాజయ్య నియమితులు కావడం పట్ల ఆయన సన్నిహితులు, పార్టీ వర్గాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. ఛైర్మన్ రాజయ్యతో పాటు ప్రకటించిన ముగ్గురు సభ్యుల్లో మహబూబాబాద్‌కు చెందిన మాలోతు నెహ్రూనాయక్ ఉన్నారు. మిగతా ఇద్దరిలో వికారాబాద్‌కు చెందిన మల్కుడ్ రమేశ్, సూర్యాపేటకు చెందిన సంకెపల్లి సుధీర్‌రెడ్డికి చోటు దక్కింది.

పార్లమెంట్ రేసు నుంచి పక్కకు..

సిరిసిల్ల రాజయ్యను ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్‌గా ప్రభుత్వం నియమించడంతో ఇక ఆయనకు వరంగల్ పార్లమెంట్ టికెట్ తలుపులు మూసివేసినట్లే అయింది. వరంగల్ పార్లమెంట్ ఆశావహుల్లో ముఖ్యులుగా సిరిసిల్ల రాజయ్య ఉన్నారు. గతంలో ఆయన ఎంపీగా పని చేయడం, టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి పగ్గాలు చేపట్టకు ముందు నుంచే ఆయనకు మద్దతుదారుడిగా ఉండడంతో రేవంత్‌రెడ్డికి కూడా రాజయ్యకు పదవి కల్పన బాధ్యతగా పరిణమించింది. వరంగల్ పార్లమెంట్ టికెట్ రేసులో పోటీ అధికంగా ఉండడం, టికెట్ కేటాయింపు భారమైన తరుణంలో రాజయ్యకు సముచిత స్థానం కల్పించాలనే నిర్ణయంతో రేవంత్‌రెడ్డి స్టేట్ ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్‌గా నియమించారనే అంచనాలు జిల్లా పార్టీ వర్గాల్లో నెలకొన్నాయి. రాజయ్యకు నామినేటెడ్ పోస్టు దక్కడంతో పార్లమెంట్ టికెట్ రేసు నుంచి ఒకరు తప్పినట్లైయింది. దీంతో మిగతా ఆశావహులు కూడికలు, తీసివేతల్లో తలమునకలయ్యారు. స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సభ్యుల్లో ఒకరైన మహబూబాబాద్‌కు చెందిన మాలోతు నెహ్రూనాయక్ కూడా అసెంబ్లీ టికెట్‌ను ఆశించిన వారే. ఆయనకు కూడా సభ్యుడిగా బాధ్యతలు అప్పగించి న్యాయం చేశారనే అభిప్రాయాలు నెలకొన్నాయి.

భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు

వరంగల్ లీగల్, ఫిబ్రవరి 16 : వివాహేతర సంబంధం ఉన్నదనే అనుమానంతో భార్యను వేధింపులకు గురి చేసి హత్యకు పాల్పడిన ఎమ్డీ అయూబ్ ఖాన్ అనే కానిస్టేబుల్‌కు యావజ్జీవ కారాగార శిక్షా , రూ. 10 వేలు జరిమానా విధి స్తూ వరంగల్ జిల్లా ప్రధాన సెషన్స్ జడ్జి కోకా రాధాదేవి శుక్రవారం తీర్పు చెప్పారు. కేసు వివ రాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్ జిల్లా కేంద్రం అశోక్ నగర్‌కు చెందిన తస్మీన్ సుల్తా నాను వరంగల్ జిల్లా పెన్షన్‌పుర గ్రామానికి చెందిన ఎమ్డీ అయూబ్ ఖాన్‌కు ఇచ్చి 2006 సంవ త్సరంలో వివాహం జరిపించారు. ప్రస్తుతం ఆయూబ్ ఖాన్ రఘునాథపెల్లి పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తు న్నాడు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, 2019 నుంచి భార్య ప్రవర్తనను అనుమానిస్తూ వివా హేతర సంబంధం కొనసాగిస్తుందన్న నేపంతో శారీరకంగా, మానసికంగా వేధిస్తుం డేవాడు. ఎన్నిసార్లు అత్తింటివారు సర్ది చెప్పినా నిందితు డిలో మార్పు రాలేదు. ఈ క్రమంలో 2020 జూన్ 5న తస్మీన్ సుల్తానా తన అన్న సాదిక్ హుస్సేన్‌కు ఫోన్‌చేసి ఎప్పటిలాగా తనను అనుమానిస్తూ వేధిస్తున్నాడని చెప్పింది. తన తల్లిదండ్రులను అదే రోజు చెల్లెల్లి అత్తగారింటికి పంపించి మరునాడు జూన్ 6న సాయంత్రం సాదిక్ హుస్సేన్ చెల్లెలి ఇంటికి వెళ్లాడు. అక్కడే ఉన్న తల్లిదండ్రులతో విషయం తెలుసుకోగా తస్మీన్ సుల్తానాను నిందితుడు బయటకు తీసుకెళ్లా డని తెలిపారు.విషయంపై విచారించగా మామునూరు క్యాంపులోని పాత క్వార్టర్స్‌లో తన చెల్లె కనిపించిందని ముఖంపై గాయాలతో, గొంతు బిగించి మృతి చెంది ఉంది. దీంతో తన చెల్లెలు తస్మీన్ సుల్తాన్‌ను నింది తుడు అనుమా నంతో చంపాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు స్వీరించిన మాము నూరు పోలీసులు నిందితుడిపై హత్యానేరం నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున ఎమ్డీ అయుబ్‌ఖాన్‌కు జీవిత ఖైదు, రూ . 10 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ ఆజ్మీరా సాంబూ నాయక్ సాక్షులను ప్రవేశాెట్టగా లైజనింగ్ అధికారిగా ఎం. వెంకటస్వామి, దర్యాప్తు అధికారిగా అప్పటి సీఐ సార్ల రాజు వ్యవహరించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిరబోయిన శ్రీనివాస్ కేసు వాదించారు.

ఎంజీఎంలో అనుమానాస్పద వ్యక్తులు..

దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగింత

హనుమకొండ అర్బన్, ఫిబ్రవరి 16: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో కలకలం రేగింది. గురువారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఇద్దరు వ్యక్తులు ఎంజీఎం ఆస్పత్రిలోని పిల్లల వార్డుకు చేరుకున్నారు. మా అమ్మాయి కనిపించడం లేదంటూ వార్డులోని ఎన్ఐసీయూకు వెళ్లారు. అక్కడ అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో సెక్యూరిటీ గార్డులు అక్కడకు చేరుకొని వారిని ఆస్పత్రికి బయటకు పంపించారు. కాగా,, రాత్రి 11 గంటల ప్రాంతంలో మరోసారి పిల్లల వార్డు ముందు తిరుగు తూ కనిపించారు. దీంతో అనుమానం వచ్చిన స్థానికులు వారిని చితకబాది పోలీసులకు అప్పగించారు. ఆడ, మగ వ్యక్తులు అనుమానాస్పదంగా ఎంజీఎంలో పిల్లల వార్డు సమీపం లో తిరుగుతున్నారని పోలీసులు చెప్పారు. పూర్తి వివరాలు రాబడుతున్నట్లు మట్టెవాడ పోలీసులు తెలిపారు.

భూపాలపల్లిలో పిల్లలను ఎత్తుకెళ్లేందుకు వచ్చాడని...

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఫిబ్రవరి 16: పిల్లలను ఎత్తుకెళ్లే వారు సంచరిస్తున్నారనే వందతులు వ్యాపించిన నేపథ్యంలో ఓ వ్యక్తిని కాలనీవాసులు పట్టుకొని తాళ్లతో కట్టి చితకబాదారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన భూపాలపల్లి పట్టణంలోని ఎల్‌బీనగర్‌లో చోటుచేసుకుంది. కాలనీలో ఇద్దరు వ్యక్తులు శుక్రవారం తెల్లవారు జాముున సంచరిస్తుండగా స్థానికుడు ఒకరు గమనించాడు. వెంటనే చుట్టుపక్కల వారిని పిలిచి విషయం చెప్పాడు. దీంతో అప్రమత్తమైన కాలనీవాసులు ఆ ఇద్దరు వ్యక్తులను పట్టుకునేందుకు యత్నించారు. వీరిలో ఒకరు ద్విచక్రవానంపై పరారు కాగా మరొకరు కాలనీవాసులకు పట్టుబడ్డాడు. దీంతో అతడిని తాళ్లతో కట్టేసి పోలీసులకు అప్పగించారు. ఆ వ్యక్తి వరంగల్‌కు చెందిన వాడని తమ విచారణలో వెల్లడైందని పోలీసులు తెలిపారు. అతడి పేరు రాజు అని, తాను పందులు పట్టేందుకే వచ్చానని తమకు చెప్పాడని పేర్కొన్నారు.

దూరవిద్య డిగ్రీ, పీజీ కోర్సుల ఫీజు చెల్లింపు గడువు 15

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 16 : కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం అందిస్తున్న డిగ్రీ కోర్సుల ద్వితీయ, తృతీయ సంవత్సరంతో పాటు పీజీ రెండోవ ఏడాది పరీక్ష ఫీజులను మార్చి 15 వరకు అపరాధ రుసుం లేకుండా చెల్లించుకోవాలని దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం,(జనరల్, కంప్యూటర్) బీబీఏ, బీఎస్సీతో పాటు పీజీ రెండోవ ఏడాది కోర్సుల విద్యార్థుల తమ పరీక్షల ఫలితాల కోసం వేచిచూడకుండా కోర్సుల ఫీజులు చెల్లించుకుని స్టడీ మెటీరియల్ పొందాలని తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్ నెంబర్ 0870-2461480, 2461490లో సంప్రదించాలని డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం తెలిపారు. ఇదిలా ఉండగా దూరవిద్య కేంద్రం అందిస్తున్న ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ మొదటి ఏడాది పూర్తైన అభ్యర్థులందరూ రెండో ఏడాదికి కోర్సు ఫీజులను ఎలాంటి అపరాధ రుసుం లేకండా మార్చి 15 వరకు చెల్లించుకోవాలని డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం వెల్లడించారు.

లంసం, క్యాజువల్

ఉద్యోగులకు న్యాయం చేయాలి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కచ్చకాయల చిరంజీవి



సమ్మెలో ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు కచ్చకాయల చిరంజీవి

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 16 : కేయూలో పనిచేస్తున్న లంసం, క్యాజువల్ ఉద్యోగులను కాంట్రాక్టు పద్ధతిలో అప్‌గ్రేడ్ చేసి న్యాయం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కచ్చకాయల చిరంజీవి డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా శుక్రవారం జరిగిన ఉద్యోగుల సార్వత్రిక సమ్మెను పురస్కరించుకుని సీఐటీయూ ఆధ్వర్యంలో కేయూ పరిపాలన భవనం ఎదుట నిరసన ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కచ్చకాయల చిరంజీవి ఆందోళనలో పాల్గొని మాట్లాడారు. కేయూలో తాత్కాలిక ఉద్యోగులను కాంట్రాక్టు పద్ధతిలోకి అప్‌గ్రేడ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించి న్యాయం చేయాలని అన్నారు. అనంతరం కేయూ సీఐటీయూ నాయకులు కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్‌ను కలిసి వర్సిటీ ఉద్యోగుల సమస్యలపై వినతి పత్రాన్ని అందచేశారు. సానుకూలంగా స్పందించి 4 రోజుల్లో ఉద్యోగులతో భేటీ నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ అధ్యక్షుడు ఆకుతోట రాంచందర్, కార్యదర్శి దేశిని రవికుమార్, ఉపాధ్యక్షుడు పల్లం రాజు, మధు, ట్రెజరర్ ఎం.రాజేందర్, సందీప్, కృష్ణ, శోభ. లక్ష్మి, రాణి, సరోజన తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం నుంచి రూ.3కోట్లు

మేడారం జాతరకు కేటాయిస్తున్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రకటన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వరంగల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : మేడారం మహాజాతరపై కేంద్ర ప్రభుత్వం దృష్టిసారించింది. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' మెయిన్‌లో 'మేడారం జాతరకు కేంద్రం మొండి చేయి.. తెలంగాణ కుంభమేళాకు పైసా ఇవ్వని మోదీ సర్కార్' అనే కథనానికి కేంద్ర ప్రభుత్వం స్పందించింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఈ మేరకు ప్రకటన చేశారు. మేడారం మహాజాతరకు కేంద్ర ప్రభుత్వం రూ.3 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిధులతో మహాజాతరలో భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించేందుకు వెచ్చించనున్నట్లు వెల్లడించారు. కాగా, 2020 జాతరకు కేంద్ర ప్రభుత్వం రూ.6.10 కోట్లు ఇవ్వగా, 2022 జాతరకు రూ.2.50 కోట్లు మాత్రమే ఇచ్చింది. తాజాగా కిషన్‌రెడ్డి రూ.3 కోట్లు ఇస్తామని ప్రకటించటంతో భక్తుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. ఈ నెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు తెలంగాణ కుంభమేళాగా పిలిచే మేడారం జాతర జరగనుంది. ఇందు కోసం ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రూ.110 కోట్లు కేటాయించింది.

మేడారానికి ప్రత్యేక రైళ్లు

21నుంచి నడపనున్నట్టు రైల్వే శాఖ వెల్లడి

గిర్మాజీపేట (వరంగల్), ఫిబ్రవరి 16 : ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో ఈ నెల 21 నుంచి మూడు రోజుల పాటు జరిగే మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు దక్షిణమధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను నడపనుంది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది భక్తులు హాజరయ్యే ఈ జాతరకు సికింద్రాబాద్, నిజామాబాద్‌ల నుంచి వరంగల్ వరకు ప్రత్యేక రైళ్లు నడుస్తాయని దక్షిణమధ్య రైల్వే శుక్రవారం రాత్రి ప్రకటించింది.

సికింద్రాబాద్ నుంచి..

మేడారం మహాజాతర ప్రత్యేక రైలు సికింద్రాబాద్‌లో ప్రతి రోజు ఉదయం 9.52 గంటలకు బయలుదేరి కాజీపేటకు మధ్యాహ్నం 12.12 గంటలకు, వరంగల్‌కు ఒంటిగంటకు చేరుకుంటుంది. తిరిగి అదే మధ్యాహ్నం 1.55 గంటలకు వరంగల్‌లో బయలుదేరి కాజీపేట మీదుగా సాయంత్రం 6.20 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ ప్రత్యేక మేడారం రైలు మౌలాలి, చర్లపల్లి, ఘట్‌కేసర్, బీబీనగర్, భువనగిరి, యాదగిరి, వంగపల్లి, ఆలేరు, పెంబర్తి, జనగామ, రఘునాథపల్లి, స్టేషన్ ఘన్‌పూర్, పెండ్యాల్, కాజీపేటలో ఆగుతుంది. ఈ నెల 21 నుంచి 25 వరకు ప్రతి రోజు ఈ ప్రత్యేక రైలు సికింద్రాబాద్-వరంగల్ మధ్య నడుస్తుంది.

నిజామాబాద్ నుంచి..

నిజామాబాద్ నుంచి మేడారం ప్రత్యేక రైలు ఈ నెల 21 నుంచి 24 వరకు సికింద్రాబాద్ మీదుగా కాజీపేట, వరంగల్ వరకు నడుస్తుంది. ఈ నాలుగు రోజుల్లో మేడారం ప్రత్యేక రైలు ప్రతీ రోజు ఉదయం 7.05 గంటలకు నిజామాబాద్‌లో బయలుదేరి సికింద్రాబాద్‌కు 11 గంటలకు చేరుకుంటుంది. సికింద్రాబాద్ నుంచి ఉదయం 11.10 గంటలకు బయలుదేరి కాజీపేటకు మధ్యాహ్నం 1.15 గంటలకు, వరంగల్‌కు 1.45 గంటలకు చేరుకుంటుంది. తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు వరంగల్‌లో బయలుదేరి 3.15కు కాజీపేటకు చేరుకుంటుంది. కాజీపేట నుంచి మధ్యాహ్నం 3.20 గంటలకు బయలుదేరి సాయంత్రం 4 గంటలకు జనగామ, సాయంత్రం 5.30 గంటకు సికింద్రాబాద్‌కు, రాత్రి 10.30 గంటలకు నిజామాబాద్‌కు చేరుకుంటుంది. నిజామాబాద్ నుంచి వరంగల్‌కు నడిచే ఈ ప్రత్యేక రైలు కామారెడ్డి, అకన్నపేట, మిర్జాపల్లి, వాదిరాం, మనోహరాబాద్, మేడ్చల్, బొల్లారం, మల్కాజిగిరి, సికింద్రాబాద్, చర్లపల్లి, ఘట్‌కేసర్, బీబీనగర్, భువనగిరి, వంగపల్లి, ఆలేరు, జనగామ, రఘునాథపల్లి, స్టేషన్ ఘనపూర్, పెండ్యాల్, కాజీపేట స్టేషన్‌లలో ఆగుతుంది. ఈ ప్రత్యేక రైళ్ల ద్వారా వచ్చే భక్తులు కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్‌ల వద్ద ఏర్పాటు చేసిన మేడారం బస్‌స్టేషన్‌ల నుంచి ఆర్టీసీ బస్సుల ద్వారా మేడారం వెళ్లేందుకు జిల్లా అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు



కమాండ్ కంట్రోల్ ప్రారంభిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

మేడారం, ఫిబ్రవరి 16: మహాజాతరలో భక్తుల సౌకర్యార్థం మేడారంలో పోలీస్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. పోలీస్ కమాండ్ కంట్రోల్‌లో దీనిని ఏర్పాటు చేయగా కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం ప్రారంభించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా టోల్ ఫ్రీ నంబరు 18004250620 అందుబాటులో ఉంటుందనిక తెలిపారు. జాతర పరిసరాల్లో మొత్తం 382 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నామని అన్నారు. భక్తుల భద్రతా దృష్ట్యా జాతరలో ఎనిమిది జోన్లుగా 42 సెక్టార్లుగా విభజించి అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్రీజ, వేణుగోపాల్, జిల్లా ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్ పాల్గొన్నారు.

మహాజాతరకు ఆర్టీసీ రెడీ

రేపటి నుంచి ప్రత్యేక బస్సులు - 6వేల బస్సుల్లో 35 లక్షల మంది భక్తుల తరలింపే లక్ష్యం - మేడారంలో 55ఎకరాల్లో తాత్కాలిక బస్‌స్టేషన్ ఏర్పాటు



మేడారంలో భక్తుల కోసం సిద్ధంగా ఉన్న తాత్కాలిక బస్టాండ్

సుబేదారి, ఫిబ్రవరి 16 : మేడారం మహాజాతరకు భక్తులను తరలించేందుకు ఆర్టీసీ సిద్ధమైంది. రాష్ట్ర నలుమూలల నుంచి ఆరు వేల బస్సుల ద్వారా 35లక్షల మంది భక్తులను తల్లుల చెంతకు చేర్చాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే జాతర రోజుల్లో భక్తుల రద్దీకి తగ్గట్టుగా బస్సుల సంఖ్య పెంచుతూ అదాయాన్ని పెంచుకునే దిశగా ఆర్టీసీ అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇక ఆదివారం నుంచి మేడారానికి బస్సు సర్వీసులను ప్రారంభించనున్న అధికారులు మేడారంలో 55 ఎకరాల్లో తాత్కాలికంగా ఆర్టీసీ ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ జిల్లాలు, ప్రాంతాల వారీగా క్యూలైన్లు, పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. అలాగే బస్సుల మరమ్మతులకు షెడ్లు, ఆర్టీసీ సిబ్బంది, కార్మికులు, అధికారులకు వసతి షెడ్లు, తాగునీటి, మరుగుదొడ్లు, ప్రయాణికుల కోసం విశ్రాంతి షెడ్లను నిర్మించారు. ఆర్టీసీ ఉద్యోగుల కోసం అత్యవసర వైద్య సేవలను అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. గద్దెల వరకు భక్తులను చేర్చేలా ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. బస్సుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు భక్తులకు తెలియజేసేందుకు భారీ ఎల్‌ఈడీ స్క్రీన్లను జాతరలోని ముఖ్య ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పోలీస్‌శాఖకు అనుసంధానం చేస్తున్నారు. జాతర కోసం 6 వేల ఆర్టీసీ బస్సులను సిద్ధం చేయగా వాటిలో వరంగల్ రీజియన్ నుంచే సుమారు 2500 బస్సులను నడపనున్నారు. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, రంగారెడ్డి, నల్గొండ, ఖమ్మం జిల్లాలతో పాటు మహారాష్ట్ర నుంచి కూడా బస్సులను నడిపించేందకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. మొత్తం 12,300 మంది ఆర్టీసీ సిబ్బంది విధుల్లో ఉండనుండగా మరో 500 మంది అధికారులు సేవలను పర్యవేక్షించనున్నారు.

ఫ్రీ టిక్కెట్‌తో పెరగనున్న మహిళా భక్తుల సంఖ్య

నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించింది. ఈ క్రమంలోనే ఈసారి మేడారం వెళ్లే మహిళా భక్తులకు కూడా ఉచిత ప్రయాణ అవకాశం ఇస్తున్నట్టు ప్రకటించడంతో జాతరకు మహిళల సంఖ్య అధికంగా ఉండే అవకాశం ఉంది. దీంతో ఆర్టీసీకి మహిళా ప్రయాణికుల ద్వారా లాభం చేకూరుతుందని అంచనా వేస్తున్నారు.

భక్తులకు ఆర్టీసీ సేవలు విస్తృతం

జాతరకు వచ్చే భక్తులు ఎక్కువమంది ఆర్టీసీ బస్సులో ప్రయాణించేందుకే ఆసక్తి చూపుతున్నారు. ప్రతీజాతరకు ఆర్టీసీ తన సేవలను విస్తృతం చేస్తోంది. 1996లో మేడారం జాతరను రాష్ట్ర పండుగగా ప్రభుత్వం గుర్తించినప్పటి నుంచి ఆర్టీసీ సేవలు అధికారికంగా ప్రారంభమయ్యాయి. అయితే ప్రధానంగా 2008 నుంచి ఆర్టీసీ సేవలు విస్తృతమయ్యాయి. 2008లో 2,688 బస్సులను నడిపి 12 లక్షల మంది భక్తులను ఆర్టీసీ చేరవేసింది. 2010లో 3వేల బస్సుల ద్వారా 14లక్షల మందిని, 2012లో 3,100 బస్సుల ద్వారా 14లక్షల మంది భక్తులను తమ గమ్య స్థానాలకు ఆర్టీసీ చేరవేసింది. ఇక 2014లో 3,160 బస్సుల ద్వారా 14లక్షల మంది భక్తులను, 2016లో 3,382 బస్సుల ద్వారా 14లక్షల మంది భక్తులను ఆర్టీసీ చేరవేసింది. ఇక గత 2018 మహాజాతరలో 4వేల బస్సులతో 18లక్షల మంది భక్తులను తరలించారు. అయితే 2018లో రాష్ట్ర వ్యాప్తంగా 3,565 బస్సులతో 41వేల ట్రిప్పుల ద్వారా 18లక్షల మందిని తరలించగా, 2020 మహాజాతరలో 3,860 బస్సుల ద్వారా 45వేల ట్రిప్పులను నడిపి 19లక్షల మంది భక్తులను గమ్య స్థానాలకు చేర్చారు. 2022 జాతరలో 3,845 బస్సుల ద్వారా 21లక్షల మంది భక్తులను జాతరకు తరలించారు. ప్రస్తుతం 6వేల బస్సుల ద్వారా భక్తులను జారతకు చేర్చేందుకు ఆర్టీసీ సిద్ధమయింది. ఇందుకు రాష్ట్రవ్యాప్తంగా 100కు పైగా బస్సు పాయింట్‌లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది.

భక్తులు సహకరించాలి

జె.శ్రీలత, ఆర్టీసీ ఆర్ఎం, వరంగల్ రీజియన్



మేడారంకు వచ్చే భక్తులు ఆర్టీసీ సిబ్బందికి సహకరించాలి. గత జాతర కంటే అధికంగా భక్తులను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తులు ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షితంగా ప్రయాణించాలి. ఈ నెల 18 నుంచి మేడారానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మహాలక్ష్మీ పథకంలో భాగంగా మహిళలకు ఉచితంగా బస్సుసౌకర్యం కల్పించడంతో ఈ సారి ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

గత జాతరల్లో భక్తులకు అందించిన సేవలు

ఏడాది	బస్సులు	ప్రయాణికులు
2008	2,688	12లక్షలు
2010	3,000	14లక్షలు
2012	3,100	14లక్షలు
2014	3,160	14లక్షలు
2016	3,382	14లక్షలు
2018	3,565	18లక్షలు
2020	3,860	19లక్షలు
2022	3,845	21లక్షలు

జాతరపై సాంకేతిక పర్యవేక్షణ

ట్రాఫిక్, భక్తుల రద్దీ నియంత్రణకు ప్రత్యేక ఏర్పాట్లు

సాఫ్ట్‌వేర్ వినియోగం, సీసీ కెమెరాల ఏర్పాటు

వివిధ ప్రాంతాల సమాచారంతో ప్రత్యేక యాప్ రూపకల్పన

భూపాలపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : గిరిజన కుంభమేళాగా గుర్తింపు పొందిన మేడారం జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఈ క్రమంలో అత్యంత ముఖ్యమైన ట్రాఫిక్, భక్తుల రద్దీ నియంత్రణ, పోలీసు నిఘాపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ అంశాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సాంకేతికతను వినియోగిస్తోంది. ప్రధానంగా రద్దీ నియంత్రణ కోసం జాతరలో ఎంపిక చేసిన కీలక ప్రాంతాల్లో ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో కూడిన కెమెరాలను ఏర్పాటు చేసి.. వీటిని కంట్రోల్ రూంకు అనుసంధానించి వీటి ద్వారా చదరపు మీటరులో నలుగురికంటే ఎక్కువ మంది గుమిగూడిన ప్రాంతాలను గుర్తించి, రద్దీ నియంత్రణ చర్యలు చేపట్టనున్నారు. అలాగే భక్తుల సంఖ్యను లెక్కించే క్రౌడ్ కౌంటింగ్ కెమెరాలు, వాహనాల సంఖ్యను అంచనా వేసేందుకు నెంబర్ ప్లేట్ రికగ్నిషన్ కెమెరాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. మేడారం క్షేత్రంలోని ప్రధాన మార్గాలు, కూడళ్లు, గద్దెల ప్రాంగణం, పార్కింగ్ స్థలాల్లో మొత్తం 500కు పైగా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు. కంట్రోల్ రూంకు అనుసంధానమై ఉండే వీటి ద్వారా 24గంటల నిఘా ఉండేలా చూస్తారు. నిఘాను మరింత పటిష్ఠం చేసేందుకు గాను డ్రోన్ కెమెరాలను కూడా వినియోగించనున్నారు. ఇక వీటి నిర్వహణకు నిపుణలైన సిబ్బంది సహకారం తీసుకుని.. ఆయా ప్రాంతాలపై దృష్టి పెట్టనున్నారు.

జాతర వివరాల ప్రత్యక్ష ప్రసారానికి ఎల్ఈడీ తెరలు

మేడారంలోని పలు ప్రాంతాల్లో ఎల్ఈడీ తెరలను ఏర్పాటు చేసి జాతర వివరాలు, విశేషాలు, తప్పిపోయిన వారి వివరాలను ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. వాహనాల పార్కింగ్ కోసం 1400 ఎకరాల మేర విస్తరించి ఉన్న 33 పార్కింగ్ స్థలాలను అందుబాటులోకి తేనుండగా.. భక్తుల కోసం ఆర్టీసీ ఆరు వేల బస్సులను నడపాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ట్రాఫిక్‌కు ఎలాంటి అటంకాలు లేకుండా నియంత్రణ పకడ్బందీగా జరిగేలా ఇప్పటికే వలంటీర్లు, సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.



అధికారులు అంకితభావంతో పనిచేయాలి

ఏటూరునాగారం ఐటీడీఏ పీవో అంకిత్

మేడారం, ఫిబ్రవరి 16: మేడారం జాతరలో విధులు నిర్వర్తిస్తున్నమన అధికారులు అంకితభావంతో పనిచేయాలని ఏటూరునాగారం ఐటీడీఏ పీవో అంకిత్ అన్నారు. మరో నాలుగు రోజుల్లో మహాజాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో సెక్టోరియల్ అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. మేడారంలోని గిరిజన బాలిక ఇంగ్లిష్ ఆశ్రమ పాఠశాలలో సెక్టోరియల్ అధికారులకు నిర్వహిస్తున్న రెండో విడత శిక్షణ కార్యక్రమంలో పీవో మాట్లాడారు. మహాజాతర విధుల్లో పాల్గొనే అధికారులు ఈనెల 19న రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిబద్ధతతో పనిచేసి మహాజాతరను విజయవంతం చేయాలన్నారు. జంపన్నవాగు వద్ద విధులు నిర్వహించే అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఏమాత్రం ఏమరపాటుగా ఉండొద్దని అన్నారు. జాతర పరిసరాల్లో ఆర్అండ్‌బీ అధికారులు సూచిక బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. జన సమూహంలో నిరంతరంగా పారిశుధ్య నిర్వహణ చేపట్టాలన్నారు.

పరిసరాల్లో దుర్వాసన రాకుండా ఎప్పటికప్పుడు రసాయనాలతో శుభ్రం చేస్తుండాలన్నారు. భక్తుల ఆరోగ్యాన్ని కాపాడాలని, అవసరమైతే తక్షణమే వైద్యం అందించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయా శాఖల అధికారులు సెక్టార్ల వారీగా సిబ్బందికి విధులు అప్పగించాలన్నారు. జాతరలో ప్లాస్టిక్ నిషేధాన్ని పకడ్బందీగా చేపట్టాలన్నారు. పేపర్, క్లాత్, జూట్ బ్యాగులను మాత్రమే భక్తులు వినియోగించేలా చూడాలన్నారు. ప్లాస్టిక్ ఫ్రీ జాతరగా జరుపుకోవాలనే సందేశం ప్రతి ఒక్కరికీ తెలియాలని సూచించారు. గద్దెల వద్ద విధులు నిర్వహించే అధికారులు సమన్వయంగా పనిచేయాలన్నారు. భక్తుల పట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ వెంకన్న, డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య, ఐటీడీఏ ఏపీవో వసంతరావు పాల్గొన్నారు.



సెక్టార్ అధికారులతో మాట్లాడుతున్న పీవో అంకిత్



మేడారంలోని తల్లుల గద్దెల వద్ద భక్తుల కోలాహలం



బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ కింద స్నానాలచరిస్తున్న భక్తులు



బంగారాన్ని తల్లులకు సమర్పించేందుకు వెళ్తున్న భక్తులు



జంపన్న వాగులో స్నానమాచరిస్తున్న భక్తులు

నేడు కేయూకు నిజనిర్ధారణ కమిటీ

వర్సిటీ అధికారులు, విద్యార్థులతో ముఖాముఖీ

కమిటీ రాకతో వర్సిటీలో సర్వత్రా ఉత్కంఠ

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 16 : కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్లలో అక్రమాలు జరిగాయంటూ విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో రాష్ట్ర ఉన్నతా విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ వి.వెంకటరమణ నేతృత్వంలో త్రిసభ్య కమిటీని రాష్ట్ర ప్రభుత్వం నియామించింది. ఈ మేరకు శనివారం కాకతీయ యూనివర్సిటీకి త్రిసభ్య కమిటీపీహెచ్‌డీ అడ్మిషన్లపై నిజనిర్ధారణకు రానుంది. ఈ మేరకు వర్సిటీ ఉన్నతాధికారులకు నిజానిర్ధారణ కమిటీ పర్యటన వివరాలను లేఖలో వర్సిటీకి తమ పర్యటన షెడ్యూల్‌ను అధికారికంగా తెలియజేసింది.

ఫిబ్రవరి 17 ఉదయం 10.30 గంటల నుంచి 11 గంటల వరకు వీసీతో ప్రాథమిక చర్చలు, 11.15- 12.15 వరకు పీహెచ్‌డీ అడ్మిషన్ల సంబంధిత అధికారులతో చర్చలు, 12.30 నుంచి 1.15 వరకు, 2.15 3.30 రెండు దఫాలుగా విద్యార్థుల నుంచి పీహెచ్‌డీ-2 అడ్మిషన్లలో చోటుచేసుకున్న పరిణామాలు, విద్యార్థుల అభ్యంతరాలను వినతి పత్రాల ద్వారా నిజా నిర్ధారణ కమిటీ స్వీకరిస్తోంది. సాయంత్రం 3.45 గంటల నుంచి 4 గంటల వరకు నిజానిర్ధారణ కమిటీ సేకరించిన వివరాలను సమ్‌అప్ చేసి పర్యటన ముగిస్తారు. కాగా, కమిటీలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి. వెంకటరమణ పీహెచ్‌డీ నిజానిర్ధారణ కమిటీకి ఛైర్మన్‌గా వ్యవహరించగా ఆయనతో పాటు మరో ఓయూ జియాలజీ విభాగం ప్రొఫెసర్ పాండురంగారెడ్డి, టెక్నికల్ ఎడ్యుకేషన్ జాయింట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు రానున్నారు. పీహెచ్‌డీ అడ్మిషన్లపై రాష్ట్ర ప్రభుత్వం కల్పించుకుని వర్సిటీ చరిత్రలో మొదటి దఫా నిజానిర్ధారణ కమిటీ వేసి విచారణ జరిపించడం పట్ల సర్వత్రా చర్చనీయంగా మారింది. నిజానిర్ధారణ కమిటీ రిపోర్టు పీహెచ్‌డీ అడ్మిషన్ల లోగుట్టును బట్టబయలు చేయనుందని వర్సిటీలో చర్చలు జోరందుకున్నాయి.

నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 16 : జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం, మార్చి 3న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాలపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రెండు కార్యక్రమాల నిర్వహణకు సంబంధిత అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ.. ఈ నెల 20న జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఒక సంవత్సరం నుంచి 19 సంవత్సరాల వరకు వయస్సున్న పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయడం జరుగుతుందన్నారు.

జిల్లాలో 2 లక్షల 33వేల 500 మంది పిల్లలకు ఈ మాత్రలు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. మార్చి 3వ తేదీన జిల్లాలో 79వేల 227 మంది చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేయనున్నట్లు డీఎంహెచ్‌ఓ తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్‌వో వైవి.గణేష్, డీఈవో డాక్టర్ అబ్దుల్ హై, అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మదన్ మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ యాకూబ్‌పాషా, డీఐఓ డాక్టర్ వాణిశ్రీ, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఉమాశ్రీ, డాక్టర్ హిమబిందు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

అజర ఆస్పత్రిలో పునరావాస కేంద్రం ప్రారంభం



ప్రారంభిస్తున్న డాక్టర్ కాళీప్రసాద్

హనుమకొండ అర్బన్, ఫిబ్రవరి 16 : హనుమకొండ ములుగురోడ్‌లోని అజర హాస్పిటల్‌లో ఫిజియోథెరపీ, పునరావాస కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఇకపై హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లకుండా ఇక్కడే అజర హాస్పిటల్‌లో తక్కువ ఖర్చుతో అత్యాధునిక వైద్యం పొందవచ్చని హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బండారు శివసుబ్రమణ్యం తెలిపారు. అత్యాధునికమైన యూఎస్ ఇంపోర్టెడ్, ఎలక్ట్రో థెరపీ యూనిట్‌తో వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు దివ్వెల మోహన్‌దాస్, వలపదాసు చంద్రశేఖర్, పగడాల కాళీప్రసాద్, మాగంటి శేషుమాధవ్, కె.నాగార్జునరెడ్డి, ఎమ్డీ.అన్వర్, బి.శ్రీనివాస్, అప్పాల సుధాకర్, పెరుమాండ్ల రామకృష్ణ, వంశీ, హరీష్ పాల్గొన్నారు.

కమిషనరేట్ పరిధిలో సీఐల బదిలీలు

ఉత్తర్వులు జారీచేసిన సీపీ అంబర్ కిశోర్ ఝా

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 16: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఐదుగురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఐతే కొందరు ఒకే చోట ఎక్కువ కాలం పని చేయడం, మరి కొందరిపై కొన్ని ఆరోపణలు రావడంతో స్థానచలనం చేసినట్టు తెలుస్తోంది.

పోస్టింగ్ పొందిన వారు ఒకటి, రెండు రోజుల్లో విధుల్లో చేరాలని సీపీ అంబర్ కిశోర్ ఝా ఆదేశాలు జారీ చేశారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ ఐన ప్రదేశం
వై. సుధాకర్‌రెడ్డి	కమిషనరేట్	కాజీపేట
సీహెచ్ శ్రీధర్	కేయూసీ	వీఆర్ (వెకెన్సీ రిజర్వ్) వరంగల్
వి. చేరాలు	వీఆర్ (వెకెన్సీ రిజర్వ్)	వరంగల్ కేయూసీ
డి. రవిరాజు	వీఆర్ (వెకెన్సీ రిజర్వ్)	వరంగల్ పరకాల
ఎం. అబ్బయ్య	పరకాల	సీసీఎస్ వరంగల్

సీకేఎం కళాశాలలో వైద్య శిబిరం

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 16 : వరంగల్ దేశాయిపేటలోని సీకేఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దేశాయిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భరత్ నేతృత్వంలో ఉపాధ్యాయులకు, విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అదేవిధంగా శరత్ కంటి వైద్యశాల నిర్వాహకులు డాక్టర్ ప్రవీణ్, అనిల్ నేతృత్వంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశిధర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ధర్మారెడ్డి, లైబ్రేరియన్ అనిల్, డాక్టర్ మోహన్, కుమార్, కెప్టెన్ డాక్టర్ సతీష్‌కుమార్, రమేష్, రఫీ, పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

కాకతీయ కళాతోరణం, చార్మినార్ తొలగించవద్దు

• అసెంబ్లీలో కడియం శ్రీహరి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీహరి

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 16: రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నం నుంచి కాకతీయ కళాతోరణం, చార్మినార్‌ను తొలగించవద్దని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సూచించారు. శుక్రవారం కడియం శ్రీహరి అసెంబ్లీలో పలు అంశాలను ప్రస్తావించారు. తన నియోజకవర్గ పరిధిలోని ధర్మసాగర్ మండలం ఎలుకుర్తి గ్రామంలో 2017లో సైనిక్ స్కూల్ మంజూరు కావడం జరిగిందన్నారు. సైనిక్ స్కూల్ ఏర్పాటుకు డిఫెన్స్ మినిస్ట్రీతో అగ్రిమెంట్ కావడంతో పాటు స్థలం కేటాయించడం జరిగిందన్నారు. ఈ స్కూల్‌ను సికింద్రాబాద్‌కు తరలించాలని ప్రభుత్వం నిర్ణయించుకున్నట్లు తెలిసిందన్నారు. ఎట్టి పరిస్థితిలోనూ తన నియోజకవర్గానికి మంజూరైన స్కూల్‌ను మార్చకూడదన్నారు. కేంద్రం మరో 100 సైనిక్ స్కూల్స్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించడం జరిగిందని, కేంద్రంపై ఒత్తిడి తెస్తే రాష్ట్రానికి మూడు సైనిక్ స్కూల్స్ వచ్చే అవకాశం ఉందన్నారు. వర్ధన్నపేట, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలోని మడికొండ, ధర్మసాగర్ ఏరియాలో 30 ఎకరాల్లో డంపింగ్ ఉందన్నారు. ఈ డంపింగ్ యార్డుతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ డంపింగ్ యార్డును మడిపల్లి ఏరియాలో ఉన్న ప్రభుత్వ స్థలానికి తరలించేలా చర్యలు తీసుకోవాలని కడియం శ్రీహరి సభలో ప్రస్తావించారు.

కానిస్టేబుళ్లుగా ఎంపికైన వారిని అభినందించిన కమాండెంట్

మామునూరు, ఫిబ్రవరి 16 : పోలీసు కానిస్టేబుల్స్‌గా ఎంపికైన వారిని మామునూరు పోలీసు నాలుగో బెటాలియన్ కమాండెంట్ డి.శివప్రసాద్ అభినందించారు. బెటాలియన్‌లోని తన కార్యాలయంలో శుక్రవారం మాట్లాడుతూ బెటాలియన్‌లో 300 మందికి శిక్షణ ఇవ్వగా 30 మంది కానిస్టేబుళ్లుగా ఎంపిక కావడం అభినందించదగ్గ విషయమని చెప్పారు. ఎంపికైన వారందరు సమాజానికి ఉపయోగపడే విధంగా ఉండాలన్నారు. శిక్షణ సమయంలో పోలీసులు అనుసరించాల్సిన అంశాలపై క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సూచించారు. పట్టుదలతో కష్టపడితే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా శిక్షణ ఇచ్చిన సిబ్బందిని సైతం కమాండెంట్ డి.శివప్రసాద్ అభినందించారు.

కార్మిక సంఘాల సమ్మె విజయవంతం

సంగెం, ఫిబ్రవరి 16 : దేశవ్యాప్త సమ్మెలో భాగంగా శుక్రవారం సంగెం మండల కేంద్రంలో కార్మిక సంఘాల సమ్మె విజయవంతమైంది. సంయుక్త కిసాన్‌మోర్చా కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసన తెలిపారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బంద్ నిర్వహించారు. మండల కేంద్రంలోని పాఠశాలలు, వ్యాపార సంస్థలు, బ్యాంకులు, హోటల్స్ బంద్‌లో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు హమాలీ సంఘం, తాపీమేస్త్రీలు ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. కార్మిక సంఘం నేతలు కార్మిక హక్కుల సాధనకు ఉద్యమాలు చేయడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చాయి. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకుడు ఇస్మాయిల్, మండల నాయకులు గోనె రాంచందర్, గుండేటి స్వామి, శంకర్, ప్రవీణ్, ఎల్లయ్య, రాజేశ్, వెంకన్న, అశోక్‌బాబు, గోపాల్, రాజు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని పల్లార్‌గూడ గ్రామంలో కేంద్ర ప్రభుత్వం తీరుకు నిరసనగా తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య, మండల అధ్యక్షుడు పోడేటి బాబు, రైతులు బొంత సమ్మయ్య, సలేంద్ర, వెంకటేశ్వర్లు, వీరస్వామి, లచ్చులు తదితరులు పాల్గొన్నారు.



సంగెం మండల కేంద్రంలో సమ్మె చేస్తున్న కార్మిక సంఘాలు నాయకులు

• గీసుగొండ : గ్రామీణ భారత్ బంద్ మండలంలో శుక్రవారం పాక్షికంగా జరిగింది. ఈ సందర్భంగా బ్యాంకులను, వ్యాపార సంస్థలను ఆల్‌ట్రేడ్ యూనియన్ నాయకులు బంద్ చేయించారు. అనంతరం కార్మిక రైతు ప్రదర్శనను నిర్వహించి మాట్లాడారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు పార్లమెంటులో చట్టం చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు టి.బ్రహ్మచారి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గోనె కుమారస్వామి, సారంపల్లి రత్నాకర్‌రెడ్డి, కందికొండ కుమారస్వామి, సంధ్య, బండి బుచ్చయ్య, రాణి, వజ్ర, రమేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నగరంలో కార్మికుల ర్యాలీలు

గిర్మాజిపేట : ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా శుక్రవారం వరంగల్ జిల్లాకే కేంద్రంలో కార్మిక, రైతు సంఘాలు భారీ ప్రదర్శన నిర్వహించాయి. ఈ సమ్మెకు మద్దతుగా తెలంగాణ ఆర్‌టీసీ మహిళలకు ఉచిత ప్రయాణంకు నిరసనగా ఆటోల బంద్ నిర్వహించారు. వరంగల్ జిల్లా ఆల్ ట్రేడ్ యూనియన్స్ సంయుక్త కార్యాచరణ కమిటీ, సంయుక్త కిసాన్ మోర్చాల ఆధ్వర్యంలో నరేంద్ర మోదీ ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కార్మికులు వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరారు. ఈ ర్యాలీ హెడ్‌పోస్టాఫీసు, వరంగల్ చౌరస్తా, జేపీఎన్ రోడ్డు, మండిబజార్ మీదుగా పోచమ్మమైదాన్ వరకు సాగింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గన్నారపు రమేష్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు పుల్లా రమేష్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి నర్రా ప్రతాప్, సీపీఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ రంగయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ రాచర్ల బాలరాజు, సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు మాధవిలు కేంద్ర ప్రభుత్వ విధానాలను విమర్శించారు. ఈ ర్యాలీలో వివిధ కార్మిక, రైతు, ప్రజా సంఘాల నాయకులు సాగర్, చెన్నకేశవులు, రవి, జగదీశ్వర్, నలిగంటి రత్నమాల, ఖాసీం, ఇనుముల సాంబమూర్తి, యాకుబ్, దండు లక్ష్మణ్, విక్టోరియా, సుమలత, పనాస ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి అవుట్ సోర్సింగ్ కార్మికులు శంకర్ ఆధ్వర్యంలో కార్మిక సమ్మెకు మద్దతుగా ఆస్పత్రి ఎదుట నిరసన తెలిపారు.



నగరంలోని స్టేషన్ రోడ్డులో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

ఆటోడ్రైవర్ల నిరసన

తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలును నిరసిస్తూ జాతీయ కార్మిక సమ్మెకు మద్దతుగా మన తెలంగాణ ఆటోడ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం వరంగల్‌లో ఆటోల బంద్ జరిగింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆటోల బంద్ పాటించి వరంగల్ చౌరస్తాలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మన తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సంజీవ్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఎం.బాబు, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కె.జయరాం, నాయకులు పి.బాబు, బి.సంజీవ, అమీర్, ఈశ్వర్, రవిందర్, యాకుబ్ పాషాతో పాటుగా ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

రామ్‌లల్లా దర్శనానికి తరలిన భక్తులు

ఆస్తా రైలులో వరంగల్ నుంచి 422 మంది

గిర్మాజిపేట, ఫిబ్రవరి 16: అయోధ్య బాలరాముడి దర్శనం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక రాయితీతో ఏర్పాటు చేసిన శ్రీరామ దర్శన్ అభ్యాయన్ కార్యక్రమంలో భాగంగా మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ అయోధ్య ప్రత్యేక ఆస్తా రైలు శుక్రవారం రాత్రి వరంగల్ మీదుగా అయోధ్యకు వెళ్లింది. మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలోని భద్రాచలం(కొత్తగూడెం) రోడ్డు నుంచి భక్తులు, బీజేపీ శ్రేణులతో బయలుదేరింది. మహబూబాబాద్‌లో బీజేపీ నాయకులు, భక్తులు ఈ రైలు ఎక్కారు. రాత్రి 6 గంటలకు వరంగల్ చేరుకోగా, నర్సంపేట, కొత్తగూడ, ములుగు ప్రాంతాలకు చెందిన 422 మంది భక్తులు, బీజేపీ కార్యకర్తలు అయోధ్యకు వెళ్లారు. వరంగల్ రైల్వేస్టేషన్‌లో అయోధ్య వెళ్తున్న భక్తులు, పార్టీ శ్రేణులకు బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ వీడ్కోలు పలికారు. జై శ్రీరామ్ నినాదాలతో వరంగల్ రైల్వేస్టేషన్ 3వ ప్లాట్‌ఫారం మార్మోగింది.



వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి భక్తులతో బయలుదేరిన ప్రత్యేక రైలు

అయోధ్య రామ్‌లల్లా దర్శనం చేసుకునేందుకు ఐఆర్‌సీటీసీ రానుపోను, దర్శనం, వసతి, భోజనంతో కలిపి ప్రతీ ఒక్కరికి రూ.1750 చెల్లించి ప్రత్యేక రైలులో వెళ్లవచ్చని రైల్వే అధికారులు తెలిపారు.

న్యూడెమోక్రసీ నేతలను కోర్టులో హాజరుపర్చాలి

సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నేత ఆరెల్లి క్రిష్ణ

వరంగల్‌టౌన్, ఫిబ్రవరి 16: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి అశోక్, వరంగల్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి గోపన్నను అరెస్టు చేసిన పోలీసులు వెంటనే కోర్టులో హాజరు పర్చాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు ఆరెల్లి క్రిష్ణ డిమాండ్ చేశారు. నగరంలోని కాశిబుగ్గ జంక్షన్‌లో న్యూడెమోక్రసీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరెల్లి క్రిష్ణ మాట్లాడుతూ.. తమ పార్టీ పీడిత ప్రజల విముక్తి కోసం పోరాటాలు చేస్తుందని తెలిపారు. ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాల్లో గిరిజన, గిరిజనేతర ప్రజానీకానికి పోడు భూములను కొట్టి వారికి పంచి అభివృద్ధికి తోడ్పాటును అందిస్తుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తమతో కలిసి పనిచేసిందని, ఆ తరువాత మా పార్టీ నాయకులను ఎన్‌కౌంటర్ పేరుతో చంపిందన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ కూడా మా పార్టీ ఉండాలని కోరుకుంటూనే నాయకులను అక్రమంగా అరెస్టు చేసిందన్నారు. ఇప్పటికైనా అరెస్టు చేసిన అశోక్, గోపన్నతో పాటు అఖిల భారత రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి గౌని ఐలయ్య, న్యూడెమోక్రసీ మహబూబాబాద్ జిల్లా నాయకుడు పుల్లయ్యను వెంటనే కోర్టులో హాజరు పర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతుకూలీ సంఘం నాయకుడు రాచర్ల బాలరాజు, ఐఎఫ్‌టీయూ నాయకుడు గంగుల దయాకర్, మానవ హక్కుల వేదిక నాయకులు బండి కోటేశ్వర్‌రావు, బన్న నర్సింగం, రాజేందర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



కాశిబుగ్గలో ధర్నా నిర్వహిస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

సెర్ప్ ఉద్యోగులు మార్పునకు శ్రీకారం చుట్టాలి

డీఆర్‌డీవో కౌసల్యాదేవి

వరంగల్ సిటీ, ఫిబ్రవరి 16: మహిళలు ఆదాయ ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలతో సుస్థిర జీవనోపాదులు ఏర్పాటు చేసుకొని ఆర్థిక, సామాజిక మార్పుకు శ్రీకారం చుట్టేలా సెర్ప్ ఉద్యోగులు కృషి చేయాలని డీఆర్‌డీవో జె.కౌసల్యాదేవి అన్నారు. శుక్రవారం డీఆర్‌డీవో కార్యాలయంలో సీసీలు, ఏపీఎంలకు సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కౌసల్యాదేవి మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాల సభ్యులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి జిల్లాను ఆదర్శంగా ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. ఉద్యోగులు నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని, నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి అడిషనల్ డీఆర్‌డీవో ఎం.దయాకర్, ప్రాజెక్టు మేనేజర్ అనిత, ఏపీఎంలు వి.వేణు, పి.అశోక్, సురేష్, కిరణ్, సుధాకర్, వేణుగోపాల్, ధర్మేందర్, ప్రేమ్‌రాజ్, సీసీలు జి.కొమురయ్య, రమేష్‌కుమార్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పది ఫలితాల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి

జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 16: పదవ తరగతి విద్యార్థులు కష్టపడి చదివి ఫలితాల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలబెట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారి డి.వాసంతి అన్నారు. వరంగల్ దేశాయిపేటలోని లక్ష్మి గార్డెన్స్‌లో శుక్రవారం పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అన్ని సబ్జెక్టులపై అవగాహన కల్పించారు. తెలంగాణ రికగ్నైజ్డ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ట్రస్మా) ఆధ్వర్యంలో జరిగిన సదస్సుకు ముఖ్య అతిథిగా డీఈవో హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి మానసిక ఒత్తిడికి గురికాకూడదని సూచించారు. పిల్లలకు సరైన పౌష్టికాహారం అందజేయాలని తల్లిదండ్రులను కోరారు. విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని అన్నారు. సదస్సులో ట్రస్మా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నెమరుగొమ్ముల రమేష్‌రావు, రాష్ట్ర అడ్వైజర్ కొమ్మినేని భూపాల్‌రావు, వరంగల్ డీసీఈబీ చైర్మన్ కృష్ణమూర్తి, ఎంఈవో విజయ్‌కుమార్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు చల్ల నాగార్జునరెడ్డి, ప్రోగ్రాం కన్వీనర్ గుమ్మడవెల్లి సురేష్, బాశెట్టి వెంకటేశ్వర్లు, దండాపంతుల రామ్మూర్తి, వంగాల రాధాకృష్ణ, నాసం సూర్యనారాయణ, బొల్లం కనకయ్య, రాంపల్లి రవి, జన్ను విలియమ్స్, సుధీర్, యాదా విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

మెట్టుపల్లి చైతన్య గీతాల పుస్తకావిష్కరణ

సంగెం, ఫిబ్రవరి 16: గ్రామీణ ప్రాంతాల్లోని వ్యక్తుల్లో మేధాశక్తికి మించిన అంశాలు ఉంటాయని ప్రముఖ రచయిత వల్లంపట్ల నాగేశ్వరరావు, ఆచార్య బన్న అయిలయ్య అన్నారు. సంగెం మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం ఎంపీటీసీ, ప్రముఖ రచయిత, గాయకుడు మెట్టుపల్లి మల్లయ్య రచించిన పలు గీతాల పుస్తకాన్ని ప్రముఖ రచయిత, ఉపాధ్యాయుడు చిలువేరు శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు ఆవిష్కరించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో చరిత్రకు తెలియని పలువురు రచయితలు, గాయకులు ఉన్నారని, వారిని గుర్తించి తగిన ప్రోత్సాహం అందించడం వలన సమాజానికి ఉపయోగపడే పలు కవితలు వెలుగులోకి వస్తాయని చెప్పారు. ప్రజలను చైతన్యం చేసే పాటలు, సాహిత్యంను నిరంతరం సాధన చేయాలని సూచించారు. రచయితలు సమకాలీన, ఆర్థిక, సామాజిక అంశాలపై ప్రభావశీలమైన కొత్త ఆలోచనలతో సామాజిక బాధ్యత కలిగిన రచనలను చేయాలని అన్నారు. అనంతరం మల్లయ్య తల్లిదండ్రులు లక్ష్మి-యాదగిరికి మొదటి పుస్తకాన్ని అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ కందకట్ల కళావతి, రైతుబంధు మండల మాజీ అధ్యక్షుడు కందకట్ల నరహరి, వైస్ ఎంపీపీ బుక్క మల్లయ్య, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు నర్సింహస్వామి, మొగిలి, కాసం క్రాంతికుమార్, జ్యోతి పాల్గొన్నారు.



సంగెంలో పుస్తకావిష్కరణలో పాల్గొన్న నేతలు

తంబాకు కోసం ఘర్షణ...

తీవ్ర గాయాలతో ఒకరు మృతి

నర్సంపేటలో ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి



మృతి చెందిన రాజు (ఫైల్)

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 16: తంబాకు(అంబర్) కోసం ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణ ఒకరి మృతికి కారణమైంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని ద్వారకపేటలో జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. ద్వారకపేటకు చెందిన ఒగ్గుల రాజు(37), ముత్యం ప్రశాంత్ గ్రామంలోని తాము పనిచేసే మేస్త్రీ రవి కుటుంబం ఈ నెల 14న దేవుడి పండుగ చేసుకోగా విందుకు వెళ్లారు. విందు అనంతరం ముత్యం ప్రశాంత్ ఒగ్గుల రాజును తంబాకు ఇవ్వాలని అడగ్గా తన వద్ద లేదని చెప్పాడు. దీంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. అంబర్ ఇవ్వలేదన్న అక్కసుతో ప్రశాంత్ తన చేతితో రాజును చితకబాదాడు. ఈ క్రమంలో రాజు ఛాతిపై తీవ్రమైన దెబ్బలు తగలగా.. ఆ సమయంలో ఇబ్బంది పడుతూనే ఇంటికి వెళ్లిన రాజు రాత్రి నిద్రలోనే చనిపోయాడు. ఆ తర్వాత జరిగిన విషయం తెలుసుకున్న మృతుడి కుటుంబ సభ్యులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. శుక్రవారం కేసు నమోదు చేశామని ఎస్ఐ రవి తెలిపారు. మృతుడికి భార్య జ్యోతి, ఇద్దరు కుమారులున్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

గీసుగొండ, ఫిబ్రవరి 16: మండలంలోని 14 మంది రౌడీషీటర్‌లకు నూతనంగా బాధ్యతలు తీసుకున్న సీఐ బాబులాల్ శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రౌడీషీటర్ల పూర్వకేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. లా అండ్ ఆర్డర్‌ను అతిక్రమించి చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

భూ వివాదాల్లో, బెదిరింపులు, రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో, ఇతర అవాంఛనీయ ఘటనల్లో రౌడీషీటర్‌లు పాల్గొన్నట్లు గుర్తిస్తే పీడీయాక్టు కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకన్న, పోలీసులు పాల్గొన్నారు.

మహంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు

ఖిలావరంగల్, ఫిబ్రవరి 16: వరంగల్ రంగశాయిపేటలో తలపెట్టిన బొడ్రాయి (గ్రామదేవత) పూజలు విజయవంతమైన సందర్భంగా కార్పొరేటర్ గుండు చందన-పూర్ణచందర్‌లు మహంకాళి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి చీర, గాజులు, ఒడిబియ్యం సమర్పించారు. 41వ డివిజన్ రంగశాయిపేటలోని లక్ష్మిగణపతి దేవాలయం, మహంకాళి దేవాలయంలో శుక్రవారం పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 11 నుంచి 14 వరకు శ్రీ సచ్చిదానంద సరస్వతి మహాస్వామి, గ్రామ పురోహితులు వెలిదె నరసింహమూర్తిశర్మ, ప్రభాకర్ శాస్త్రి, భార్గవ్‌శర్మ, ప్రదీప్‌శర్మలచే గ్రామదేవత బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించామన్నారు. కార్యక్రమంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యనిర్వాహక కమిటీ కన్వీనర్ కొల్లూరి యోగానంద్, పర్యవేక్షణ కమిటీ కన్వీనర్ కేడల జనార్దన్, సమన్వయ కమిటీ కన్వీనర్ గుండు పూర్ణచందర్, కమిటీ సభ్యులు, రంగశాయిపేట యూత్ ఫోర్స్ కమిటీ, భక్తులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న కార్పొరేటర్ గుండు చందనపూర్ణచందర్

శివనగర్‌లో రథసప్తమి పూజలు

34వ డివిజన్ శివనగర్‌లోని రామాలయంలో రథసప్తమిని పురస్కరించుకుని మహిళలు లక్ష పసుపు కొమ్ములతో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లలితాపారాయణం చేపట్టారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ ఎన్నిక

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 16: గ్రేటర్ వరంగల్ మూడవ డివిజన్ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. మూడవ డివిజన్ కొత్తపేటలోని క్రీస్తు దర్శన మందిరంలో శుక్రవారం పాస్టర్ల సమావేశం జరిగింది. అధ్యక్షుడిగా కొండపాక పీటర్, ప్రధాన కార్యదర్శిగా ఈసంపెల్లి సదర్శన్, ట్రెజరర్ సీహెచ్.రత్నరాజు, గౌరవ అధ్యక్షుడిగా జన్ను ఇర్మియ, గౌరవ అధ్యక్షుడిగా ఈ.శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా దామెర శ్యాం, ఎస్ స్టీవెన్, జాయింట్ సెక్రెటరీలు విజయ్‌చందర్, శ్రీనివాస్, అధికార ప్రతినిధిగా లాదర్ల రమేష్‌పాల్, లీగల్ అడ్వైజర్‌గా మైదం జైపాల్, సలహాదారులుగా రెవరెండ్ రవినందన్, ఫాదర్ జెరోమ్, గాస్పెల్ ఇన్‌చార్జి క్రిస్టఫర్‌లు ఎన్నికయ్యారు. ఈ కమిటీ రెండు సంవత్సరాలు కొనసాగుతుందన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

వివరాలు వెల్లడించిన మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య

కరీమాబాద్, ఫిబ్రవరి 16 : వరంగల్ రంగశాయిపేటలో ఈ నెల 13న రాత్రి యువకుడిని హత్య చేసిన సంఘటనలో విచారణ చేపట్టిన మిల్స్‌కాలనీ పోలీసులు 10 మందిని నిందితులుగా గుర్తించి అరెస్టు చేశారు. హత్యకు ఉపయోగించిన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం సీఐ మల్లయ్య వివరాలను వెల్లడించారు. రంగశాయిపేట ఆదర్శనగర్‌కు చెందిన బజ్జూరి రమేష్, విజయ దంపతుల కుమార్తె రమ్యకు, రంగంపేట ప్రాంతానికి చెందిన దుట్ట శ్రీనివాస్‌తో ఏప్రిల్ 22, 2015లో వివాహమైంది. ఏడాది తర్వాత శ్రీనివాస్ భార్యను వేధించడం ప్రారంభించాడు. ఈ విషయమై రమ్య ఫిర్యాదుతో మహిళా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. శ్రీనివాస్ వేధింపులు భరించలేక రమ్య దూరంగా ఉంటూ విడాకులు కోరుతూ కోర్టును ఆశ్రయించింది. కోపం పెంచుకున్న అతను సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలతో చెడు ప్రచారం చేయగా, మిల్స్‌కాలనీ, హైదరాబాద్ సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లలో కేసులు నమోదు చేశారు.



నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ మల్లయ్య, ఎస్ఐలు

తన కూతురు పట్ల తప్పుడు ప్రచారం చేస్తుండటంతో తండ్రి బజ్జూరి రమేష్ కూతురు రమ్య కుమారుడు అఖిల్‌ను హైదరాబాద్‌లోని ఓ హాస్టల్‌లో చేర్పించాడు. రంగశాయిపేటలో ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకలు జరుగగా వారు వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న శ్రీనివాస్ 13న సాయంత్రం 6 గంటలకు ద్విచక్ర వాహనంపై పలుమార్లు రమేష్ ఇంటి చుట్టూ తిరుగుతూ చంపుతానంటూ బెదిరిస్తూ వెళ్లాడు. విసుగు చెందిన వారు అతన్ని చంపాలని రమేష్ కొడుకు అఖిల్, కూతురు రమ్య, భార్య విజయ నిర్ణయించుకున్నారు. అదే రోజు రాత్రి 10.30 గంటలకు శ్రీనివాస్ ద్విచక్ర వాహనంపై చక్కర్లు కొడుతుండగా అఖిల్ రాయితో కొట్టగా కిందపడిపోయాడు. ఈ వెంటనే బజ్జూరి రమేష్, కుమారుడు అఖిల్, కూతురు రమ్య, భార్య విజయతో పాటు బొడ్రాయి పండుగకు ఇంటికి వచ్చిన బంధువులు శ్రీనివాస్‌ను చుట్టుముట్టి గోడకు గట్టిగా కొట్టడంతో ఇనుప మేకు తలలో గుచ్చుకుంది. స్నేహితురాలు అలేఖ్య రోకలిబండ అఖిల్‌కు ఇచ్చి, తాడు తీసుకొచ్చి రమ్యకు ఇవ్వడంతో శ్రీనివాస్ మెడకు బిగించింది. ప్రతి ఘటిస్తుండడంతో తాడుతో శ్రీనివాస్‌ను కట్టి వేశారు. విజయ కారంపొడిని కంట్లో చల్లింది. అనంతరం అతని మెడకు తాడును చుట్టి గట్టిగా బిగించి కొట్టడంతో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనలో మొత్తం పది మందిని నిందితులుగా గుర్తించి అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్సైలు వెంకన్న, గోవర్ధన్, మునీరుల్లా, సిబ్బంది పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL శనివారం 17 ఫిబ్రవరి 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

తల్లుల దీవెనల కోసమే పాదయాత్ర

చెన్నారావుపేట, ఫిబ్రవరి 16 : సమ్మక్క-సారలమ్మ తల్లుల దీవెనల కోసమే మేడారం జాతరకు కాలినడనక వెళుతున్నా మని బుడగ జంగాల ఎక్తగ్రూప్ నాయకులు తుర్రాట్ బాబు, సారయ్య, కిషోర్, వస్తం శ్రీనివాస్‌లు తెలిపారు. శుక్రవారం మేడారం జాతరకువెళ్లే ఈ యువకుల పాదయాత్ర చెన్నా రావుపేటకు చేరుకుంది.వారు మాట్లాడుతూ.. ప్రతీ రెండేళ్లకో సారి జరిగే మేడారం జాతరకు తొర్రూర్, కంటాయపాలెం, అమ్మాపురం, సాయినగర్‌ల నుంచి తప్పకుం డా పాదయాత్ర



కాలినడకన మేడారానికి వెళుతున్న బుడగ జంగాల యువకులు

చేసుకుంటూ వెళ్తామని తెలిపారు. పాదయాత్రలో కుమార స్వామి, సంజీవ, శ్రీనివాస్, సంతోష్, హస్సేన్, ఏడుకొండలు, అజయ్, సంపత్, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయాలి

• డీఈవో వాసంతి



విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందిస్తున్న డీఈవో

రాయపర్తి, ఫిబ్రవరి 16 : గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీయాలని వరంగల్ డీఈవో వాసంతి వరంగల్ జిల్లాడీఈవో వాసంతి శుక్రవారంఅన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో సైన్స్ ఫెయిర్ ఎగ్జిట్ కాంపిటీషన్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థికి ప్రశంసా పత్రం అందించి అభినందించారు. గైడ్ టీచర్ జి.ప్రవీణ్‌రెడ్డి సహకారంతో ఎకో ఫ్రెండ్లీ మస్కిటో కిల్లర్ అనే పరికరాన్ని రాయపర్తి ప్రభుత్వ పాఠ శాలలో పదో తరగతి చదువుతున్న ఎం.శ్రేయాన్ అనే విద్యార్థి తయారు చేయడం సంతోషకరమైన విషయమన్నారు. రాష్ట్ర సైన్స్ ఫెయిర్‌లో తృతీయ స్థానం ఎంపిక కావడంతో పాటు జాతీయస్థాయిలో కూడా ఎగ్జిబిట్ ప్రదర్శించే విధంగా కృషిచేయా లని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కట్ల శ్రీనివాస్, హెచ్‌ఎం గారె కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు సునీత, నవమణి, శర్మ, రోజారాణి, మమత, ఉమ పాల్గొన్నారు.

అరెస్టు చేసిన న్యూ డెమోక్రసీ నాయకులను కోర్టులో హాజరుపర్చాలి



నర్సంపేటలోని అంబేద్కర్ సెంటర్‌లో నిరసన కార్య క్రమంలో పాల్గొన్న న్యూడెమోక్రసీ నాయకులు

నర్సంపేట, ఫిబ్రవరి 16 : బయ్యారం పోలీసులు అరెస్టు చేసిన సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్రకార్యదర్శి అశోక్, రాష్ట్ర నాయకులు గోపన్నలను వెంటనే కోర్టులో హాజరుపర్చాలని న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు నున్నా అప్పారావు, మొగిలి ప్రతాప్‌రెడ్డి, ఎలకంటి రాజేందర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గత బీఆర్ఎస్ ప్రభుత్వం అవలంబించిన విధానాలనే అవలంబిస్తుందన్నారు. న్యూ డెమోక్రసీ నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకొని ఏజెన్సీలో కూబింగ్ చేస్తూ భయానక వాతావరణాన్ని సృష్టిస్తుందన్నారు. అరెస్టు చేసిన అశోక్, గోపన్నలను వెంటనే కోర్టులో హాజరుపర్చేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు గట్టికృష్ణ, సుమన్, ఐఎఫ్‌టీయయూ జిల్లా సహాయ కార్యదర్శి బరిగెల కుమార్, భీమగాని మల్లయ్య, మధు, రాజు, రవి, దేవేందర్, వీరస్వామి, సాంబన్న, పీడీఎస్‌యూ నాయకుడు కొమ్ముక రవి పాల్గొన్నారు.

బీసీల జనాభా గణన చేయడం సంతోషకరం

రాయపర్తి, ఫిబ్రవరి 16 : రాష్ట్రంలో బీసీల జనాభా గణన చేయుటకు ప్రభుత్వం తీర్మాణం చేయడం సంతోషకరమని రాష్ట్ర నాయిబ్రహ్మణ ప్రధాన కార్యదర్శి ఎనగందుల మురళీ ఒక ప్రకటనలో తెలిపారు. బీసీల్లో సామాజికంగా, రాజకీయంగా సరైన అవకాశాలు లేవని, విద్య, ఉపాధి అవకాశాలు కూడా తగ్గుతున్నాయని తెలిపారు. దీనిలో భాగంగా ముఖ్యమంత్రి, మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు స్పష్టం చేశారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీకి ఎంపికైన విద్యార్థులు



దుగ్గొండి, ఫిబ్రవరి 16 : మండలంలోని నాచినపల్లికి చెందిన పదో తరగతి చదువుచున్న గోవింద్ విష్ణుతేజ్. పదో తరగతి చదువుచున్న బొల్ల వరణ్‌సందీప్, దుగ్గొండికి చెందిన తొమ్మిదో తరగతి చదువుచున్న సయ్యాద్ ఇఫ్రాన్‌లు సబ్ జూనియర్ కబడ్డీలో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. శుక్రవారం నుంచి 19 తేది వరకు సూర్యపేట జిల్లాలోని చింతలపాలెంలో జరుగుచున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటున్నారని జిల్లా కబడ్డీ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి, మండల ప్రధాన కార్యదర్శి కక్కెర్ల మలి కార్జున్ గౌడ్ శుక్రవారం వెల్లడించారు. ఈ సందర్భంగా కబడ్డీ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు రాంరెడ్డి, మండల అధ్యక్షుడు పుప్పాల ఎల్లయ్య, సింగతి జనార్ధన్, పొగాకు సమ్మాలు, పుజారి యాదగిరి, వెంకన్న, రంగారెడ్డి, రమేశ్, కుమారస్వామి, జమలోద్దీన్‌లు విద్యార్థులను అభినందించారు.

భారత్ బంద్ విజయవంతం



నర్సంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు



వర్ధన్నపేటలో రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేస్తున్న కార్మిక సంఘాలు



ఖానాపురంలో నిరసన ర్యాలీలో పాల్గొన్న ఏఐఎఫ్‌టీయూ నాయకులు

నర్సంపేట, ఫిబ్రవరి 16: రైతు, కార్మిక వ్యతిరేక నల్ల చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సార్వత్రిక సమ్మె సందర్భంగా శుక్రవారం నర్సంపేట పట్టణంలో భారీ ర్యాలీని నిర్వహించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఈసంపల్లి బాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి భూక్య సమ్మయ్య, ఏఐఎఫ్టీయూన్యూ రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేషం, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజ్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అనంతగిరి రవి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గుంపెల్లి మునీశ్వర్, పీవైఎల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎలకంటి రాజేందర్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పిలుపు నిచ్చారు.

పోరాటాల ఫలితంగా సాధించుకున్న 44 చట్టాలను రద్దుచేసి కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. గతంలో మాదిరిగా 8 గంటల పని విధానాన్ని అమలుచేయాలని, పెరిగిన నిత్యావసర సరుకుల ధరలను అరికట్టాలని, గతంలో రైతులకు ఇచ్చిన హామీల ను వెంటనే కేంద్ర ప్రభుత్వం అమలుచేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొరబోయిన కుమారస్వామి, హమాలి యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కొల్లూరి లక్ష్మీ నారాయణ, జిల్లా అధ్యక్షుడు వడిచర్ల శ్రీనివాస్, హన్మకొండ శ్రీధర్, కందికొండ రాజు, బొల్లం ప్రసాద్, తాపీ సంఘం డివిజన్ అధ్యక్షుడు రుద్రారపు పైడయ్య తదితరులు పాల్గొన్నారు.

● వర్ధన్నపేట : కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ చేపట్టిన భారత్ బంద్ విజయవంతమైంది. వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో కార్మికులు చేపట్టిన సమ్మె కార్యక్రమం ప్రశాంతంగా కొనసాగింది. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఖమ్మం, వరంగల్ జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించిన అనంతరం బైఠాయించి నినాదాలు చేశారు. సీపీఐ అనుబంధ సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రజానాట్య మండలి ఉపాధ్యక్షుడు ఆరెల్లి రవి, సీపీఎం అనుబంధ సంఘం సీఐటీయూ జిల్లాసహాయ కార్యదర్శి టి.సాంబయ్య, జిల్లా కమిటీ సభ్యుడు తుమ్మల విజయ్ కుమార్‌లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వెంటనే ప్రజా వ్యతిరేక నల్ల చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రైతు కార్మిక సంఘాలపై కేంద్రం నిరంకుశ వైఖరి మానుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు హైమద్ పాషా, ఏఐటీయూసీ, సివిల్‌సప్లై హమాలీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు జలగం భిక్షపతి, మండల గోదాం అధ్యక్షుడు జలగం మోహన్, వేణు, కొండేటి శ్రీను, జలగం రవి, ఆనందం, సామ్యేల్, మంద రవి తదితరులు పాల్గొన్నారు.

● ఖానాపురం : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఏఐఎఫ్‌టీయూ)న్యూసీపీఎంల ఆధ్వర్యంలో శుక్రవారం భారత్ బంద్‌లో భాగంగా మండలంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. బీజేపీ పాలకులకు వ్యతిరేకంగా మండల కేంద్రంలో, అశోక్‌నగర్‌లో నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్మికసంఘం నాయకులు ఈరెల్లి రామచంద్రు, లింగయ్య, రమేష్, శ్రీను, కుమారస్వామి, రవి,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

● నెక్కొండ : దేశవ్యాప్త సమ్మెల్లో భాగంగా నెక్కొండ మండలంలో శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె విజయవంతమైంది. కార్మిక సంఘం నాయకులు నెక్కొండలో మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించిన అనంతరం వ్యాపార, వాణిజ్య సంస్థలను, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల ను మూసివేశారు. వ్యవసాయ మార్కెట్‌లో హమాలీ కార్మికులు విధులను బహిష్కరించారు. ఈ కార్యక్రమంలో జీపీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్య క్షుడు చాగంటి వెంకటయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు, నాయకులు తాటికాయల యాకయ్య, దేవపాల, మైదం యాకయ్య ఈదునూరి సాయిలు, భూక్య నరేష్, ఎండీ రఫీ తదితరులు పాల్గొన్నారు.

● నల్లబెల్లి: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా నల్లబెల్లి మండల కేంద్రంలో సీఐటీయూ, రైతుకూలీ సంఘం, సీపీఎం, హమాలీ కార్మిక సంఘం తదితర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మికులు భారత్ బంద్‌ను విజయవంతం చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు కడియా ల మనోహర్, ఈర్ల పైడి, ఈర్ల రాజు, బొడిగే సమ్మయ్య, భయ్య కుమార్, ఇస్లావత్ రవి, గాదె మోహన్‌రెడ్డి, పిండి రాజు తదితరులు పాల్గొన్నారు.

● దుగ్గొండి : భారత్ బంద్‌లో భాగంగా మండలంలోని గిర్నిబావిలో వివిధ పార్టీలకు చెందిన కార్మిక సంఘాల నాయకులు ప్రధాన రహదారి పై ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం వివిధ రకాల చట్టాలతో రైతు, కార్మి లకు తీరని అన్యాయం చేస్తోందని పీఎం మోడీ వ్యతిరేకంగా చేపట్టిన బంద్‌లో భాగంగా గిర్నిబావిలో రాస్తారోకో నిర్వహించారు. ఈ బంద్‌లో ఏఐకేఎఫ్ జిల్లా కార్యదర్శి కుసుంబ బాబురావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పుచ్చకాయల కృష్ణారెడ్డి, రైతు సంఘాల నాయకులు భూమ అశోక్, శివరాత్రి కుమార్, సింగతి మల్లికార్జున్, నాగెల్లి కొంరయ్య, బుడిమే సురేందర్, చల్లా నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● పర్వతగిరి: మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా శుక్రవారం మండల కేంద్రంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. కార్మికచట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజన రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని నినాదాలుచేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మాదాసి యాకూబ్ మాట్లాడుతూ కార్మికులకు కనీసవేతనం అమలు చేయడం లేదని, రైతులకు కనీస మద్దతు ధర ఇవ్వడంలేదన్నారు. ఉపాధిహామీ పథకంలో రోజు కూలీ రూ.600 ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ జిల్లా రమేష్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పోడేటి దయాకర్, రైతు సంఘం మండల కన్వీనర్ జంగా మల్లికార్జున్, నాయకులు నకరకంటి రాంచందర్, రంపె నాగరాజు, బోడ సురేష్, వల్లాల రాజేందర్, మహేందర్ పాల్గొన్నారు.



నెక్కొండలో సార్వత్రిక సమ్మెలో పాల్గొన్న ఏఐటీయూసీ నాయకులు



గిర్నిబావి ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న వివిధ పార్టీల నాయకులు



నల్లబెల్లిలో సమ్మెలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు



పర్వతగిరిలో రాస్తారోకో చేస్తున్న నాయకులు


నాయకుల తప్పులకు అధికారులు బలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌నాయక్

పర్వతగిరి, ఫిబ్రవరి 16 : గత ప్రభుత్వంలో కొందరు నాయకులు చేసిన తప్పులకు అధికారులు, సిబ్బంది బలవుతున్నారని కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పర్వతగిరి సొసైటీ పరిధిలో 18 గుంటల అసైన్డ్ ల్యాండ్ కొనుగోలు చేయాలని సొసైటీ చైర్మన్, డైరెక్టర్లు అధికారులు, సిబ్బందిపై ఒత్తిడి తెచ్చారని, దీంతో విధిలేని పరిస్థితుల్లో అధికారులు భూమిని కొనుగోలు చేశారని అన్నారు. కానీ, ప్రస్తుతం తమకేమీ తెలియదంటూ తప్పుకోవడం వల్లనే సొసైటీ కార్యదర్శిపై సస్పెన్షన్ వేటు పడినట్లు తెలిపారు. సొసైటీలో జరిగిన అవినీతిపై తమ ప్రభుత్వం పూర్తిస్థాయి దర్యాప్తు చేపడుతుందని, బాధ్యులపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కూసం రాంచందర్, సువార్త, బొట్ల వెంకటేశ్వర్లు, గడ్డం శ్రీనివాస్, ధరావత్ వెంకన్న, మోహన్‌నాయక్, భాస్కర్‌నాయక్, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి కోసం అధికారులు పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ విజేందర్

చెన్నారావుపేట, ఫిబ్రవరి 16: మండలంలోని గ్రామాల అభివృద్ధి కోసం అధికారులు పనిచేయాలని ఎంపీపీ బాదావత్ విజేందర్ తెలిపారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. మండలంలోని ప్రతి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలన్నారు. అలాగే అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు. అభివృద్ధి పనుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమవేశంలో ఎంపీడీవో గోవిందారావు, తహసీల్దార్ ఫణకుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్నాక్స్ అందజేత

పర్వతగిరి, ఫిబ్రవరి 16 :మండలంలోని కొంకపాక గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు వాసవి క్లబ్ వనిత, వరంగల్ వారి ఆధ్వర్యంలో రూ.5వేలు విలువగల స్నాక్స్‌ను శుక్రవారం విరాళంగా అందించారు. ఈ సందర్భం గా హెచ్‌ఎం ఎ.భిక్షపతి మాట్లాడుతూ వాసవీ క్లబ్ వనిత వారు విద్యా రంగానికి, ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చేసే సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు పుల్లూరి సుమతి, కార్యదర్శి ఆరంజ్యోతి, కోశాధికారి కల్పన, సభ్యులు హైమావతి, అన్నపూర్ణ, రత్నమాల, భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు విశ్వనాథశర్మ, వెంకట్రాంనర్సయ్య, కృష్ణమూర్తి, కుమారస్వామి, విశ్వనాథం, వెంకటేశ్వర్లు, సతీష్, రవీనా, లలిత, మమత తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు ఉపాధి భృతి చెల్లించాలని ధర్నా

దుగ్గొడి, ఫిబ్రవరి 16 : రాష్ట్రంలో మహాలక్ష్మీ పథకంతో ఉపాధి కోల్పోతున్న ఆటో కార్మికులకు ఉపాధి భృతి చెల్లించాలని తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్(తాడు) ఆధ్వర్యంలో శుక్రవారం గిర్నిబావిలోని ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. మోటార్ వాహనం చట్టం 2019ని రద్దు చేయాలని, ప్రతీ ఆటో కార్మికుడికి నెల నెలా భృతి చెల్లించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేయడంతో పాటు బంద్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన కార్మికులు బూర రామకృష్ణ, పోగాకు దేవేందర్, రమణాచారి, దండు రాజు, బాబురావు, సాంబమూర్తి, షామీర్‌పాషా, నర్సయ్య, చాన్‌పాషా, కిరణ్, ప్రశాంత్, బాలు, రవి తదితరులు పాల్గొన్నారు.

సెర్ప్ ఉద్యోగులు మార్పునకు శ్రీకారం చుట్టాలి

• డీఆర్‌డీవో కౌసల్యాదేవి

వరంగల్ సిటీ, ఫిబ్రవరి 16: మహిళలు ఆదాయ ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలతో సుస్థిర జీవనోపాదులు ఏర్పాటు చేసుకొని ఆర్థిక, సామాజిక మార్పునకు శ్రీకారం చుట్టేలా సెర్ప్ ఉద్యోగులు కృషి చేయాలని డీఆర్‌డీవో జె.కౌసల్యాదేవి అన్నారు. శుక్రవారం డీఆర్‌డీవో కార్యాలయంలో సీసీలు, ఏపీఎంలకు సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కౌసల్యాదేవి మాట్లాడుతూ... స్వయం సహాయక సంఘాల సభ్యులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి జిల్లాను ఆదర్శంగా ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. ఉద్యోగులు నిర్దేశించిన లక్ష్యాలను గడవులోగా పూర్తి చేయాలని, నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి అడిషనల్ డీఆర్‌డీవో ఎం.దయాకర్, ప్రాజెక్టు మేనేజర్ అనిత, ఏపీఎంలు వి.వేణు, పి.అశోక్, సురేష్, కిరణ్, సుధాకర్, వేణుగోపాల్, ధర్మేందర్, ప్రేమ్‌రాజ్, సీసీలు జి.కొమురయ్య రమేష్‌కుమార్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పది ఫలితాల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి

• జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 16: పదవ తరగతి విద్యార్థులు కష్టపడి చదివి ఫలితాల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలబెట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారి డీ.వాసంతి అన్నారు. వరంగల్ దేశాయిపేటలోని లక్ష్మి గార్డెన్స్‌లో శుక్రవారం పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అన్ని సబ్జెక్టులపై అవగాహన కల్పించారు. తెలంగాణ రికగ్నైజ్డ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ట్రస్మా) ఆధ్వర్యంలో జరిగిన సదస్సుకు ముఖ్య అతిథిగా డీఈవో హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి మానసిక ఒత్తిడికి గురికాకూడదని సూచించారు. పిల్లలకు సరైన పౌష్టికాహారం అందజేయాలని తల్లిదండ్రులను కోరారు. విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని అన్నారు. సదస్సులో ట్రస్మా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నెమరుగొమ్ముల రమేష్‌రావు, రాష్ట్ర అడ్వైజర్ కొమ్మినేని భూపాల్‌రావు, వరంగల్ డీసీఈబీ చైర్మన్ కృష్ణమూర్తి, ఎంఈవో విజయ్‌కుమార్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు చల్ల నాగార్జునరెడ్డి, ప్రోగ్రాం కన్వీనర్ గుమ్మడవెల్లి సురేష్, బాశెట్టి వెంకటేశ్వర్లు, దండాపంతుల రామ్మూర్తి, వంగాల రాధాకృష్ణ, నాసం సూర్యనారాయణ, బొల్లం కనకయ్య, రాంపల్లి రవి, జన్ను విలియమ్స్, సుదీర్, యాదా విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

తంబాకు కోసం ఘర్షణ...

• తీవ్ర గాయాలతో ఒకరు మృతి

• నర్సంపేటలో ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి



రాజు (ఫైల్)

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 16 : తంబాకు(అంబర్) కోసం ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణ ఒకరి మృతికి కారణమైంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని ద్వారకపేటలో జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం... ద్వారకపేటకు చెందిన ఒగ్గుల రాజు(37), ముత్యం ప్రశాంత్ తమ గ్రామంలోని తాము పనిచేసే మేస్త్రీ రవి కుటుంబం ఈ నెల 14న దేవుడి పండుగ చేసుకోగా విందుకు వెళ్లారు. విందు అనంతరం ముత్యం ప్రశాంత్ ఒగ్గుల రాజును తంబాకు ఇవ్వాలని అడగ్గా తన వద్ద లేదని చెప్పాడు. దీంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. అంబర్ ఇవ్వలేదన్న అక్కసుతో ప్రశాంత్ తన చేతితో రాజును చితకబాదాడు. ఈ క్రమంలో రాజు ఛాతిపై తీవ్రమైన దెబ్బలు తగలగా.. ఆ సమయంలో ఇబ్బంది పడుతూనే ఇంటికి వెళ్లిన రాజు రాత్రి నిద్రలోనే చనిపోయాడు. ఆ తర్వాత జరిగిన విషయం తెలుసుకున్న మృతుడి కుటుంబ సభ్యులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. శుక్రవారం కేసు నమోదు చేశామని ఎస్ఐ రవి తెలిపారు. మృతునికి భార్య జ్యోతి, ఇద్దరు కుమారులున్నారు.

బందంపల్లి జీపీ తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా పంచాయతీ అధికారి కల్పన

దుగ్గొండి, ఫిబ్రవరి 16 : మండలంలోని బందంపల్లి గ్రామ పంచాయతీని శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి కల్పన సందర్శించి అభివృద్ధి పనులు తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీ రికార్డులు, నర్సరీ, గ్రామంలోని పారిశుద్ధ్య పనులు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రమేశ్‌లు ఎంపీవోలు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థుల రికార్డుల పరిశీలన

నెక్కొండ, ఫిబ్రవరి 16 : పదో తరగతి విద్యార్థుల వార్షిక పరీక్షల్లో భాగంగా పాఠశాల అంతర్గత మార్కులకు సంబంధించి రికార్డుల పరిశీలన శుక్రవారం మండలంలోని వివిధ ప్రైవేట్ పాఠశాలల్లో ప్రారంభించారు. విద్యార్థుల వ్యక్తిగత రికార్డులను, త్రైమాసిక, అర్ధ వార్షిక పరీక్షలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులకు ఈ రికార్డుల మార్కులు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో నెక్కొండ హై స్కూల్ హెడ్మాస్టర్ ఎం. రంగరావు, రవీంద్రనాథ్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

ఎస్ఐని కలిసిన కాంగ్రెస్ నాయకులు

రాయపర్తి, ఫిబ్రవరి 16 : రాయపర్తి ఎస్ఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన వడ్డె సందీప్ కుమార్‌ను శుక్రవారం కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్ఐని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామపార్టీ అధ్యక్షుడు మచ్చ రమేష్, పీఏసీఎస్ డైరెక్టర్ కుంట రమేష్, మాచర్ల ప్రభాకర్, కోతి వీరన్న, గారె ఉప్పల స్వామి, ఎండీ రఫీ, బాషబోయిన సుధాకర్, చందు లింగయ్య, బక్కతట్ల సాయిలు, సాగర్, రియాజ్, నవీన్, ప్రవీణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయత చాటుతున్న పూర్వ విద్యార్థులు



విద్యార్థినికి నగదు పురస్కారం అందిస్తున్న ఆత్మీయ చారిటబుల్ ట్రస్టు సభ్యులు

వర్ధన్నపేట రూరల్, ఫిబ్రవరి 16 : ఆ పాఠశాలలో ఓనమాలు నేర్చుకుని వివిధ స్థాయిల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థుల పట్ల ఆత్మీయత చాటుకుంటున్నారు. శుక్రవారం మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో గతేడాది పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థిని మౌనికకు ఆత్మీయ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.10 వేల నగదు పురస్కారాన్ని అందించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం సదానందం మాట్లాడుతూ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు తిరిగి అదే పాఠశాలకు సహాయ సహకారాలు అందించడం గర్వకారణమని తెలిపారు. చారిటబుల్ ట్రస్టును ఏర్పాటు చేసి పాఠశాలకు మౌలిక సదుపాయాలు అందించడంతో పాటు విద్యార్థులను ప్రోత్సహించే విధంగా నగదు పురస్కారాలు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు ప్రోత్సహకాలను అందిపుచ్చుకొని చదువులో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మీయ ట్రస్టు సభ్యులు భరత్ కుమార్, సుభాష్‌రెడ్డి, సంధ్య, జయశ్రీ, మురళీధర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.